03 . 12. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 183 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper





# అధికార కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ లో చెరిన కాంగ్రెస్ నాయకులు చష్మోద్దీన్

**- బీఆర్ఎస్ శేకపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు...**

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని వీడి మండల నాయకులు మొహమ్మద్ చష్మోద్దీన్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అజిమోద్దీన్ సమక్షంలో గులాబీ ఖండువ కప్పుకొన్నారు. అనంతరం గ్రామ బీఆర్ఎస్ నాయకులతో, గ్రామస్తులతో కలిసి హాజరత్ షేక్ శహబుద్దీన్ దర్గాను దర్శించుకొని పెద్దఎత్తున ర్యాలీగా తరలివెల్లి గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ చష్మోద్దీన్ హస్తం పార్టీని వదిలి బీఆర్ఎస్ పార్టీలో చేరి సర్పంచ్ గా నామినేషన్ వెయ్యడం ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసిన మొహమ్మద్ చష్మోద్దీన్ మాట్లాడుతూ గత 20 సం రాలకు పైగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉంటే కనీసం తమను పట్టించుకున్న పాపం లేదని, పార్టీలో తమను విస్మరించినందునే పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. చష్మోద్దీన్ గులాబీ పార్టీలో చేరికతో గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి అనుకల వాతావరణం అని విశ్లేషకులు భావన. రాబోయే రోజుల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య గ్రామంలో నువ్వానేనా అన్నట్టు పోటీ ఉండే అవకాశం ఉందని రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజి సర్పంచ్ గడ్డమీది చిన్నారెడ్డి, మాజి ఉప సర్పంచ్ మహేబూబ్ ఖాన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు అజిమోద్దీన్, నాయకులు మొహమ్మద్ షౌకత్ అలీ, మొహమ్మద్ ఖలేద్, కుసంగి షేక్ అహేమద్, సాదిక్ అలీ, శహబుద్దిన్ సదర్, గౌసోద్దీన్ మసుల్దర్, మొహమ్మద్ సైపుద్దిన్, కలిమోద్దీన్ బాల్కి, మల్లికార్జున్ లింగాయత్, మొహమ్మద్ కలిమ్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ మక్తల్ సభ అట్టర్ ఫ్లాప్

**- లిఫ్టు రెండుసార్లు శంకుస్థాపన చేస్తారా**

**- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**

**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**



సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాల మొదటి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కొడంగల్, నారాయణ్ పేట లిఫ్ట్‌కు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. మక్తల్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా మరోసారి సీఎం శంకుస్థాపన చేశారన్నారు. ఒకే ప్రాజెక్టుకు సీఎం రెండు సార్లు శంకు స్థాపన చేస్తారా ? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేదు కనుకే సీఎం సభకు జనాలు రాలేదన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని సీఎం పూర్తి చేయడం లేదు. కమిషన్ల కోసమే కొడంగల్ లిఫ్టు పథకాన్ని ముందుకు తెచ్చారు.. సీఎం, ఆయన సోదరులు కమిషన్ల కక్కుర్తిలో మునిగిపోయారు. కేసీఆర్ ఫార్మా సిటీకి సేకరించిన 14 వేల ఎకరాలను వాడుకుని ఫ్యూచర్ సిటీ అని మభ్యపెడుతున్నారన్నారు. ఎన్నికలప్పుడు ఫార్మా భూములను రైతులకు తిరిగి ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి మాట తప్పారు. ఫ్యూచర్ సిటీని నార్త్ ఇండియా సినీ యాక్టర్లకు అప్పజెబుతున్నారు. రామోజీ ఫిలిం సిటీ ఉండగా ఇంకా వేరే ఫిలిం సిటీలు ఎందుకు? అని ప్రశ్నించారు. కేసీఆర్ కృషి వల్లే కోకాపేటలో ఎకరాకు రూ.150 కోట్ల ధర పలుకుతోంది. కేసీఆర్ వేసిన వెంచర్లలో ఎ÷-లాట్లు అమ్ముకుని రేవంత్ బతుకుతున్నాడు. రేవంత్‌కు దమ్ముంటే ఫ్యూచర్ సిటీలో వెంచర్ వేసి కోకాపేట రేటు తెప్పించగలరా ? ని పట్నం నరేందర్ రెడ్డి ప్రశ్నించారు.

# ప్రమాద కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజం

**- బీమా సొమ్ము కోసం అన్నను చంపిన తమ్ముడు**

**కరీంనగర్,డిసెంబర్ 2( వెలుతురు):**

జరిగిన ఓ రోడ్డు ప్రమాదంపై దర్యాప్తు చేసిన పోలీసులకు అది హత్యగా తేలింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో జరిగింది. బీమా సొమ్ము కోసం ఓ వ్యక్తి.. సొంత అన్నను దారుణంగా హత్య చేసిన ఘటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగింది. టిప్పర్‌తో ఢీకొట్టి చంపి.. ప్రమాదంగా చిత్రీకరించాడు. మూడ్రోజుల క్రితం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నవంబరు 29న రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి వెంకటేశ్ (39) టిప్పర్ ఢీకొని మృతి చెందినట్టు పోలీసులకు సమాచారం అందింది. శనివారం రాత్రి మట్టి తరలిస్తున్న టిప్పర్ బ్రేక్ డౌన్ కాగా.. వెంకటేశ్ టిప్పర్ ముందు భాగంలో మరమ్మతు చేస్తున్నాడు. ఇది గమనించని మృతుడి తమ్ముడు నరేష్.. టిప్పర్ స్టార్ట్ చేసి ముందుకు నడిపించాడు. వెంకటేశ్‌పై నుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు‘ అని మృతుడి తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడి వ్యవహార శైలిపై అనుమానం రావడంతో మరింత లోతుగా విచారణ జరిపారు. వెంకటేశ్ హత్యకు కుట్ర ప్రణాళికను నిందితులు ఫోన్‌లో వీడియో తీశారు. ఆ వీడియో దొరకడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మృతుడు వెంకటేశ్ పేరుతో రెండు నెలల్లోనే 10 కంపెనీలలో రూ.4.14 కోట్ల విలువైన బీమా పాలసీలు నరేశ్ తీసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. బీమా సొమ్ము కోసమే ఈ హత్య జరిగినట్టు పోలీసులు తేల్చారు.

# అన్ని పంచాయితీల్లో కాంగ్రెస్ స్వీప్ చేయాలి

**- మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపు**



**మంచిర్యాల,డిసెంబర్ 2( వెలుతురు):**

చెన్నూరు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయాలని.. అందుకు పార్టీ కార్యకర్తలు, లీడర్లు సమష్టిగా కృషి చేయాలని కార్మిక, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి, సమస్యలు తీరు తాయని భావిస్తూ ప్రజలు హస్తంపార్టీలో చేరు తున్నారని స్పష్టం చేశారు. మంత్రి వివేక మంగళవారం మంచిర్యాల జిల్లా చెన్నూరు క్యాంపు ఆఫీస్ ను సందర్శించారు. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ ఆశావాహులకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో కొమ్మెర మాజీ సర్పంచ్ తాళ్లపెల్లి సత్యనారాయణగౌడ్ తో పాటు చెన్నూరు. కో టపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన టీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, లీడర్లు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రాష్ట్ర కార్మిక, గను లశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చేస్తున్న అభివృద్ధిపట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పలువురు స్పష్టం చేశారు.

# శబరిమాత అమ్మ ప్రేమ అద్భుతం

**- దత్త జయంతికి శబరిమాత ఆశ్రమం సిద్ధం**

**- తెలంగాణ రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుండి భక్తుల రాక**

**- ప్రేమతత్వం సేవాభావమే లక్ష్యం**

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 02 :**






సంగారెడ్డి జిల్లా :- శబరిమాత ఆశ్రమంలో అమ్మ ప్రేమ,కరుణాకటాక్షాలు అద్భుతమని భక్తులు ఎల్లప్పుడూ తమ నిష్కలమైన మనసుతో కొలుస్తూ ఉంటారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో ఉన్న శబరి మాత, పురాణ పురుషులైన రామాయణంలోని శబరిని, ఈ శతాబ్దంలో జీవించిన యోగినిగా భావిస్తారు. చరిత్ర ప్రకారం శబరి మాత మెదక్ జిల్లా తొగిటలో జన్మించి, చిన్నప్పటినుండి భక్తి భావాన్ని అలవరచుకుంది. మతంగ మహర్షి ఆశ్రమంలో ఆయనకు సేవ చేస్తూ, రాముని దర్శనం కోసం ఎదురుచూడమని ఆయన ఆమెకు చెప్పాడు. ఆమె తన జీవితకాలంలో రాముడి కోసం వేచి ఉంది. తాడ్వాయిలో శబరి మాత ఆశ్రమంలో వార్షికోత్సవాలు, ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రాముడు వనవాసంలో ఉన్నప్పుడు ఇక్కడికి వస్తారని, ఆయనను దర్శిస్తే మోక్షం లభిస్తుందని మతంగ మహర్షి ఆమెకు చెప్పాడు. ఆమె తపస్సు చేసిన ప్రదేశం ఇప్పుడు తాడ్వాయిలో శబరి మాత ఆశ్రమంగా ఉంది. శబరి మాత ఈ శతాబ్దంలో జీవించిన గొప్ప అవధూతగా భావిస్తారు. తాడ్వాయిలో ఆమెకు ఒక ప్రత్యేక ఆలయం ఉంది.

**వైభవంగా దత్త జయంతి ఉత్సవాలు**

డిసెంబర్ 4 నుంచి దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా శబరిమాత ఆలయం సర్వంగ సుందరంగా ముస్తాబయింది. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల, నారాయణ్ ఖేడ్ నియోజక వర్గం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే ఈ కార్యక్రమంలో శబరిమాత ఆలయ కమిటీ బాధ్యులు అద్భుతమైన ఏర్పాట్లు చేశారు. శబరిమాత అమ్మ దీవెనలతో భక్తులు ఎంతోమంది ఆమె ప్రభావంచే వారి జీవితంలో మార్పును తెచ్చుకొని పరిపూర్ణమైన జీవితం కొనసాగిస్తున్నారు. జీవితంలో మంచి పనులు చేయాలని, సాటివారికి సాయం చేసే గుణాన్ని పెంపొందించుకోవాలని ఆమె జ్ఞానబోధ ఎంతో మందిని కదిలించింది. అప్పట్లో శబరిమాత ఇక్కడే భక్తుల సమక్షంలోసజీవ సమాధిగా మారడంతో ఆమె అద్భుత మహిమాన్విక శక్తికి భక్తులు భక్తితో పారవర్శం పొందారు అప్పటినుండి తాడ్వాయి ఆశ్రమము పరమ పవిత్ర పుణ్యక్షేత్రంగా, భక్తుల కొంగుబంగారంగా తయారైంది. దత్త జయంతి సమయంలో భక్తులు తమంతట తాము విచ్చేసి మహా అన్నదాన కార్యక్రమంలో సేవా భావంతో రెండు రోజులపాటు ఆశ్రమం వద్దే ఉంటారు.




# హిల్ట్ పాలసీతో భూములకు టెండర్

**- అనుయాయులకు కట్టబెట్టే కుట్రలు**

**- మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ విమర్శలు**

**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**



దాదాపు 10 వేల ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా కట్టబెట్టేందుకే హిల్ట్ పాలసీ తీసుకొచ్చారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ఆరోపించారు. కేవలం 45 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి డబ్బులు దండుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బండ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పరిశ్రమల స్థాపనకు టీఎస్ఐపాస్ తెచ్చి 15 రోజుల్లోనే అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూ దందా కోసమే హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని ఆరోపించారు. పరిశ్రమలకు భూములు ఇచ్చేటప్పుడే కాదు.. అమ్మేటప్పుడు కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. పర్యావరణవేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సోషల్ ఇంపాక్ట్ స్టడీస్ చేయాలనన్నారు. లీజు భూములకు హిల్ట్ పాలసీ వర్తించదని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని బండ ప్రకాశ్ తెలిపారు. మరి జీవోలో మాత్రం 9 వేల ఎకరాలకు పైనే ఎలా ప్రస్తావించారని అడిగారు. బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి జీవోలు ఎపుడూ ఇవ్వలేదని.. పారదర్శకమైన విధానం అమలు చేశామని స్పష్టం చేశారు. వ్యవసాయరంగంతో పాటు పరిశ్రమలు నడిపేలా చూడటం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. పరిశ్రమలు లేకపోతే ఉపాధి ఎట్ల అని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమలు స్థాపించే అవకాశం పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సూచించారు. బిడ్డింగ్ ద్వారా ఉపయోగంలో లేని పరిశ్రమల భూములను అమ్మాలని.. చాలా రాష్ట్రాల్లో ఈ పద్ధతి అమలు అవుతోందని తెలిపారు. హిల్ట్ పాలసీ రావడం వెనుక వేల కోట్ల రహస్య ఒప్పందాలు ఉన్నాయని బండ ప్రకాశ్ ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ లో ఉపాధి కల్పించే పరిశ్రమలు రావడం లేదని తెలిపారు. ఫిలిం యూనిట్లపై ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు తప్ప మానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ రావడం లేదని అన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా కొత్తగా ఎన్నో పరిశ్రమలు తెచ్చి పదేళ్ల కేసీఆర్ పాలనలో 18 లక్షల మందికి ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. హిల్ట్ పాలసీ రద్దు చేసి పారిశ్రామిక భూములు వేలం వేయాలని డిమాండ్ చేశారు. హిల్ట్ కు వ్యతిరేకంగా మా పోరాటాన్ని ఢిల్లీ దాకా తీసుకెళతామని స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల పర్యటనకు 8 నిజనిర్ధారణ బృందాలను పార్టీ నియమించిందని తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ మంత్రులు ఈ బృందాలకు నేతృత్వం వహించి వేర్వేరు క్లస్టర్లలో పర్యటిస్తారని పేర్కొన్నారు. 8 క్లస్టర్లలో మా నేతల బృందం రేపు, ఎల్లుండి పర్యటించి నిజాలు నిర్ధారించడంతో పాటు భూముల ధరలు నిర్ధారిస్తుందని తెలిపారు. బీజేపీ నేతలు కూడా ఆలస్యంగానైనా హిల్ట్ పై మేల్కొన్నందుకు సంతోషమన్నారు. 5 లక్షల కోట్ల రూపాయల భూకుంభకోణంపై గవర్నర్ కూడా స్పందించాలన్నారు. పర్యావరణవేత్తలు కూడా స్పందించాలని.. మా నిజనిర్ధారణ బృందాల పర్యటనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిలువు దోపిడీని అరికట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం భూములను కారు చౌకగా కట్టబెడితే పేదల ఇండ్లకు, ఆస్పత్రులకు, పార్కులకు, స్మశాన వాటికలకు భూములు ఎక్కడ్నుంచి తెస్తారని ప్రశ్నించారు.

# కేసులను బాబే ఉపసంహరించుకుంటే ఎలా

**- చట్టాలను అడ్డం పెట్టుకుని దుర్వినయోగం**

**- చంద్రబాబు తీరుపై మండిపడ్డ బొత్స**

**అమరావతి,డిసెంబర్ 2( వెలుతురు):**




తమపై ఉన్న కేసులను సుమోటోగా ఉపసంహరించుకున్న చరిత్ర దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేదని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. కానీ చట్టాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని చందరబాబు ఇలాంటి పనికి తెగించారని అన్నారు. నిజాయితీ పరుడైతే న్యాయస్థానాల నుంచి నిర్దోషిగా నిరూపించుకోవాలని, కానీ చట్టాల్లో లొసుగులు చూసుకుని కేసులు తీసేయించుకోవడం సరైంది కాదని విమర్శించారు. దీనిపై గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేసులకు సంబంధించిన ÷ళ్లైపై చంద్రబాబు సంతకాలున్నాయనీ, అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసులు ఉపసంహరించుకున్న ఏకైక సీఎం చంద్రబాబు అని ఆరోపించారు. జగన్ హయాంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడానికి పిపిపి మోడల్‌ను ప్రయోగించడం అత్యంత దుర్మార్గమని మాజీమంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రభుత్వం పై వరుస ఆరోపణలు చేశారు. కోవిడ్ తర్వాత పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచనతో మాజీ సీఎం వైఎస్ జగన్ 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించారని, అందులో ఐదు కాలేజీలు నిర్మాణం పూర్తయి రెండేళ్లుగా అడ్మిషన్లు కూడా కొనసాగుతున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా విద్య, వైద్యం పూర్తిగా ప్రైవేటీకరణలో లేవని, ప్రజలకు ఈ సేవలను అందించడం ప్రభుత్వాల బాధ్యతగా పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పూర్తిచేసినట్లు తెలిపారు. గవర్నర్ అపాయింట్ మెంట్ లభించిన వెంటనే ఆ సంతకాలను సమర్పిస్తామని ప్రకటించారు. ఇటీవల తుఫానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ధాన్యం కొనుగోలు వేగంగా జరగడం లేదని బొత్స దుయ్యబట్టారు. తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా పంటలకు గిట్టుబాటు ధరలు ఉండవని, రైతుల వద్ద కొనుగోలు శక్తి తగ్గిపోయి జీఎస్టీ వసూళ్లు కూడా పడిపోయాయని అన్నారు. ఆరు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మెడికల్ కాలేజీలు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదని, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం, ఎరువులు సమకూర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. ఈ సీజన్‌లో కూడా ఎరువుల కొరత తప్పదనే పరిస్థితి కనిపిస్తోందని హెచ్చరించారు. గత 18 నెలల్లో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నా యని, గత అయిదేళ్లలో జరిగిన నేరాల కంటే ఎక్కువ నేరాలు ఈ కాలంలోనే నమోదయ్యాయని బొత్స ఆరోపించారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో అట్టడుగున ఉందని, అప్పుల్లో అగ్రస్థానంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీల రాజీనామాల విషయంలో ఒత్తిళ్లు, ప్రలోభాలే కారణమని, మండలి ఛైర్మన్ తీసుకున్న నిర్ణయం సరైందని అన్నారు. 2019 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ గెలుచుకున్న స్థానాలేంటని ప్రశ్నించిన ఆయన, ‘పవన్ 15 ఏళ్లు కలిసి ఉండాలని కోరుకుంటే సరిపోదు, ప్రజలు కోరుకోవాలి‘ అన్నారు. ఈ ప్రభుత్వానికి 15 ఏళ్లు కాదు, 15 నెలలు కూడా అధికారంలో కొనసాగేందుకు హక్కు లేదని మండిపడ్డారు. వ్యవసాయం దండగ అని నమ్మే చంద్రబాబు నుంచి రైతులకు మేలు జరగదని బొత్స వ్యాఖ్యానించారు. సూట్‌బూట్ వేసుకున్న ధనవంతులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని ఆరోపించారు. వైఎస్సార్, వైఎస్ జగన్ రైతులకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు.

# ఈయేడు చలి తీవ్రత పెరగనుంది

**- హెచ్చరించిన భారత వాతావరణ శాఖ**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 2( వెలుతురు):**



ఈ శీతాకాలంలో దేశంలోని పలు ప్రాంతాలు మరింత చలితో వణికిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ’చలిగాలి రోజులు’ సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ విభాగం ఐఎండి వెల్లడించింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, తూర్పు యూపీ, ఉత్తర మధ్యప్రదేశ్, పడమటి మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఈ ప్రభావం ఎక్కువ ఉండనున్నదని తెలిపింది. చలి గాలుల నిర్వచనాన్ని కూడా ఐఎండీ స్పష్టం చేసింది. మైదాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువ, కొండ ప్రాంతాల్లో 0 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే దానిని చలిగాలి రోజుగా పరిగణిస్తారు. అలాగే సాధారణ కనిష్ట ఉష్ణోగ్రత కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీలు తగ్గినా అదే కోవలోకి వస్తుంది. డిసెంబర్-ఫిబ్రవరి మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు దేశంలోని కేంద్ర, సమీప ద్వీపకల్ప, వాయువ్య ప్రాంతాల్లో సాధారణం నుంచి తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం కొద్దిగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది. ప్రస్తుత సంవత్సరం లా నినా ప్రభావంలో ఉండడం కూడా చలిగాలుల పెరుగు దలకు కారణమవుతుందని వివరించారు. చలి తీవ్రత పెరుగుదల హెచ్చరికల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య నిపుణులు ప్రజలకు సూచిస్తున్నారు. మరీముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఉదయం, రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

03 . 12. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 183 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ఆరా

వార్ రూమ్‌ను సందర్శించిన భట్టి





## జూబ్లిహిల్స్ ఎన్నికల్లో బీజేపీ చెప్పిందే నిజమవుతోంది

- సీఎం వ్యాఖ్యలే నిదర్శనం
- తలెత్తుకుని తిరగలేని పరిస్థితి సృష్టిస్తున్నారు
- విడిపోయి అవమానాన్ని దిగమింగుకుంటారా?.... ఏకమై సత్తా చాటుతారా?
- హిందూ సమాజం ఆలోచించాలి
- సీఎం వ్యాఖ్యలను ఖండించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

# ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది



- తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది ఇక్కడే
- తెలంగాణ ఇచ్చిన మన్మోహన్ పేరుతో ఎర్త్ వర్సిటీ
- గ్రామాల్లో మంచి సర్పంచ్‌నే ఎన్నుకోండి
- మంత్రులతో కలిసి పనిచేసే వారినే ఆదరించండి
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సీఎం రేవంత్ శంకుస్థాపన



**కొత్తగూడెం,డిసెంబర్ 2 వెలుతురు:** ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది కూడా పాల్వలంచోలనే అని అన్నారు. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం అన్నారు. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయని అన్నారు. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

నేడు ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం రేవంత్

వివిధ రాష్ట్రాల బాధ్యతలు మంత్రులకు అప్పగింత

**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ప్రధానమంత్రి మోదీ సహా అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఢిల్లీ వెళ్తోన్న సీఎం రేవంత్‌రెడ్డి.. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. 'తెలంగాణ రైజింగ్–2025' సదస్సుకు రావాలని ప్రధానిని ఆహ్వానించనున్నారు. అనంతరం పలువురు కేంద్రమంత్రులనూ సదస్సుకు ఆహ్వానించానున్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే సహా ఇతర కేంద్రమంత్రులను ఆహ్వానించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు పలువురు మంత్రులు గురువారం

## నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

- సోనియా, రాహుల్‌లకు అండగా మనమంతా ఉన్నాం
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే మన అంతిమ లక్ష్యం
- పార్లమెంట్‌లో ఓట్ చోరీపై చర్చ రాకుండా కుట్రలు
- రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పదేళ్లు పాలించినా ఒక్క ఎయిర్‌పోర్ట్ రాలే
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం
- పిసిసి సమావేశంలో సీఎం రేవంత్ కీలక ప్రసంగం






**హైదరాబాద్,డిసెంబర్ 2 వెలుతురు:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని

## హిల్ట్ పాలసీపై మంత్రి శ్రీధర్ బాబు 2025 డిసెంబరు 01న మాట్లాడిన అంశాలకు బి.జె.ఎల్.పి నేత మహేశ్వర్ రెడ్డి స్పందన

### 2025 డిసెంబరు 02న విడుదల చేసిన బి.జె.ఎల్.పి నేత మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ వెలుతురు డిసెంబర్ 02:** హైదరాబాదులోని 22 పారిశ్రామిక వాడల్లో ఉన్న 9292 ఎకరాల భూమని మల్టీ యూజ్ జోన్లుగా కన్వర్షనుకు అనుమతిస్తూ ప్రభుత్వం తెచ్చిన హిల్ట్ పాలసీ లోపభూయిష్టంగా, రూ.లక్షా 29 వేల కోట్ల మేర ల్యాండ్ లూటీ స్కామ్ కు తావిచ్చేలా ఉందని బి.జె.ఎల్.పి నేతగా నేను గత కొద్దిరోజులుగా ఆరోపిస్తున్నాను. హిల్ట్ పాలసీలో ఉన్న లోపాలను నిరూపిస్తానని, లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ మంత్రులకు సవాల్ కూడా విసిరాను. భారీ స్థాయిలో అవినీతికి ఆస్కారమిచ్చేలా ఉన్న హిల్ట్ పాలసీని అమలుకాకుండా జోక్యం చేసుకోవాలంటూ బిజెపి ప్రతినిధి బృందం నిన్న గవర్నర్ కు కలిసి వినతి పత్రం ఇవ్వడంతో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారు స్పందించారు. పారిశ్రామిక



వాడల్లోని లీజు భూములకు కాకుండా సేల్ డీడ్ ఉన్న సొంత భూములకే మల్టీ యూజ్ జోన్ వర్తిస్తుందని, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేస్తుందని మంత్రి ప్రకటించారు.

## తెలంగాణ విజన్ డాక్యుమెంట్ - 2047లో మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధికి పెద్ద పీట

95 శాతం మంది మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్ -2047

మహిళల ఉపాధి, ఉద్యోగ అవకాశాలను విస్తృతంగా పెంచేందుకు సమగ్రమైన వ్యూహం

డాక్యుమెంట్ రూపకల్పనలో అధికారులకు పలు కీలక సూచనలు చేసిన మంత్రి సీతక్క




**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:** తెలంగాణ విజన్ డాక్యుమెంట్ – 2047 రూపకల్పనలో భాగంగా మహిళల సాధికారత, ఆర్థిక అభివృద్ధి, సంరక్షణ పోషకాహారం అంశాలపై చేపట్టాల్సిన కీలక చర్యలపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క మంగళవారం ఉదయం ప్రజాభవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి

## నడ్డాకు సిఎం, డిప్యూటి సిఎంల శుభకాంక్షలు



**అమరావతి,డిసెంబర్ 2 వెలుతురు:** భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం

## ప్రధాని కార్యాలయం సౌత్ బ్లాక్ పేరు మార్పు



- సేవాతీర్థ్ గా మారుస్తూ కేంద్రం ఉత్తర్వులు
- రాజ్‌భవన్‌ల పేర్లు లోక్‌భవన్‌లుగా మార్పు

**న్యూఢిల్లీ,డిసెంబర్ 2 వెలుతురు:** తెలంగాణలోని రాజ్ భవన్ పేరు మారింది. రాజ్ భవన్ ను లోక్ భవన్ గా పేరు మార్చారు. అన్ని రాష్ట్రాల్లో రాజ్ భవన్‌లను లోక్ భవన్ లుగా మార్చాలని కేంద్రం

## అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ


- మొంథా తుఫాన్ నష్టంపై వివరణ
- త్వరగా సాయం కోరిన లోకేశ్
- ఏవియేషన్ సిటీపై జీఎంఆర్ అధికారులతో చర్చ



**న్యూఢిల్లీ,డిసెంబర్ 2 వెలుతురు:** మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్నే మిగిల్చింది.. ఇప్పటికే ప్రాథమిక అంచనాలపై కేంద్రానికి నివేదిక చేరగా.. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. మొంథా తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ నష్టం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో తుపాను నష్టాలపై మంత్రి నారా లోకేష్ పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంత్రి లోకేష్, రాష్ట్ర హోంమంత్రి అనిత ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం, పునరావాస చర్యలు, నష్టపరిహారం అవసరాలపై సమగ్ర వివరాలు లోకేష్ అందించారు. తుపాను వల్ల మొత్తం రూ.6,352 కోట్ల నష్టం జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది. మొంథా తుపాను మొత్తం 3,109 ప్రభావిత గ్రామాల్లో ప్రభావం చూపించింది.. తుపాను తీరం దాటి సమయం: అక్టోబర్ 28 రాత్రి, కాకినాడ సమీపంలో గాలి వేగం గంటకు 100 కి.మీ వేగంతో ఉంది. అయితే, పునరావాస చర్యల్లో 1.92 లక్షల మందిని 2,471 శిబిరాలకు

## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

- ఆర్టీసీకి మరో వెయ్యి ఇవి బస్సులు
- అందకు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు
- విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గేలా ఎంవోయూలు
- గత ప్రభుత్వం తీరుతో 9వేల కోట్ల భారం
- విద్యుత్ పొందుపుపై ప్రజల్లో అవగాహన
- విద్యుత్ ఉత్పత్తి, పంపిణీపై సిఎం చంద్రబాబు సమీక్ష




**అమరావతి,డిసెంబర్ 2 వెలుతురు:** ఆర్టీసీకి మరో వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో విద్యుదుత్పత్తి, పంపిణీలో వ్యయం తగ్గింపు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఎంవోయూలు కుదుర్చుకోవాలి. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంవోయూలు చేసుకోవాలి. రాష్ట్రంలో పీఎం కుసుమ్ సహా రూఫ్‌టాప్ ప్రాజెక్టులు వేగంగా అమలు చేయాలి. ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లో కార్యాచరణ ప్రారంభించేలా చూడాలన్నారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది ప్రోత్సాహకాలు కొనసాగించాలి. థర్మల్ పవర్ స్టేషన్లలోని బూడిదను వివిధ అవసరాలకు వినియోగించాలి. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

# సంపాదకీయం..

# పార్లమెంటులో విపక్షం రచ్చ రాజకీయం !

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఊహించినట్లుగానే వాయిదాలతో మొదలయ్యాయి గతానికి భిన్నాంగా సమావేశాలు ప్రారంభం కాలేదు. గతంలోనూ ఇలాగే వాయిదాల మీద వాయిదాలు పడుతూ..మధ్యమధ్యలో ప్రభుత్వం తనకు కావాల్సిన ఎజెండాను పూర్తి కానిచ్చుకుని, నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తోంది. ఇదే తంతు గత కొన్నేళ్లుగా చూస్తున్నాం. గొడవ చేయడం, తాము పట్టిన అంశంపైనే చర్చించాలని విపక్షం పట్టుబట్టడం..ప్రభుత్వం ససేమిరా అనడం..వాయిదా పడడం కూడా గత సమావేశాల్లో చూశాం. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ జరగడం లేదు. విపక్షాలు ఇదే పెద్ద విజయంగా భావిస్తున్నాయి. కోరుకున్న అంశంపై ఎలా చర్చించాలో తెలియని వారంతా పార్లమెంటులో ఎంపిలుగా ఉన్నారు. ఏ రూల్ కింద కోరితే చర్చకు వస్తుందో అందరికీ తెలుసు. కానీ రూల్ బ్రేక్ చేసి, పట్టుబట్టి చర్చించాలని కోరుకోవడం దుర్మార్గం. పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చించడం ద్వారా ప్రతిపక్షం ప్రధాన బాధ్యతను తీసుకోవాలి. కానీ గత దశాబ్దకాలంగా అలాంటి సంప్రదాయం తుంగలో తొక్కారు. గొడవ చేయడం విపక్షం వంతయితే..వాయిదా వేయడం ప్రభుత్వం విధానంగా మారింది. ఈ క్రమంలో సోమవారం ప్రారంభమైప పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే వాయిదాతో మొదలయ్యాయి. పార్లమెంటు కార్యకలాపాలను శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లకుండా మొండిగా వ్యవహరించడంలో ఇరుపక్షాలు తమవంతు పాత్రను సమర్థంగా నిర్వహించాయి. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై అత్యవసర చర్చ జరపాలని, ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం, దానిని తిరస్కరించడం ద్వారా విలువైన పార్లమెంట్ సమయం తొలిరోజు, మలిరోజు ఢిల్లీ



కాలుష్యంలో కలిసి పోయాయి. సర్ ద్వారా నకిలీ, చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తే విపక్షాలకు అభ్యంతరం ఎందుకన్నది మొదట చర్చించాలి. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఇక్కడ ఓటు ఎలా పొందారన్నది రెండో ప్రశ్న. ఈ రెండింటికీ విపక్షాల వద్ద సమాధానం లేదు. ఒక రాజ్యంగా సంస్థ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అవుతుంది. రాజ్యాంగ బుక్‌ను పట్టుకుని ఊరేగుతున్న రాహుల్, ఆయన అనుచరగణానికి ఇది కూడా తెలియకపోవడం మూర్ఖత్వంగానే చూడాలి. రాజ్యాంగ ప్రసాదించిన హక్కుల గురించి మాట్లాడుతున్న రాహుల్ పరివారం దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తక్కువ చేసి మాట్లాడడం, వారు చేసే ప్రక్రియలను అడ్డుకోవడం రాజ్యాంగ రక్షణ అవుతుందా అన్నది రాహుల్ చెప్పాలి. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎవరి ఓటయినా గల్లంతయితే నిలదీయా లి. ఇప్పటికే సుప్రీం గడప దొక్కిన రాహుల్ ఒక్క ఓటుపైనా అఫిడవిట్ దాఖలు చేసి ఆధారాలు చూపలేక పోయారు. బీహార్‌లో ఓటమి అన్నది రాహుల్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా తెలిసి చేస్తున్నవే తప్ప మరోటి కాదు. ఇందులో ప్రజలపై వారికి ఎలాంటి ప్రేమా లేదు. కేవలం అధికార దాహంతో చేస్తున్నవే. అలా కానట్లయితే పార్టమెంటులో చర్చకు నోటీస్ ఇచ్చి, తగిన సమయంలో చర్చించవచ్చు. కానీ అలా చేయడం లేదంటే..రచ్చ చేయడం వారి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల చనిపోయిన వారి ఆధార్ నంబర్లు దాదాపు 2కోట్లను ఉడాయ్ రద్దు చేసింది. అంటే అది తప్పుచేసినట్లుగా భావించాలా? చనిపోయిన వారి ఓట్లు, ఊరుమారిన వారి ఓట్లు, అక్రమంగా దేశంలో ఓటర్లుగా నమోదైన విదేశీయుల ఓట్లను అలాగే ఉంచుమంటారా అన్నది రాహుల చెప్పాలి. నిజానికి అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాహుల్ చేస్తున్న యాగీలో భాగమే ఈ ఓటు రచ్చ. ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను పక్కన పెట్టి తొలిరోజే పార్లమెంటరీ సాంప్రదాయాలను ప్రతిపక్షాలు తుంగలో తొక్కాయి. ఫలితంగా లోక్‌సభ వరుసగా రెండ్రోజులు పూర్తిగా స్తంభించిపోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఇది ఇలాగే కొనసాగుతుంది తప్ప కొత్తగా వీరినుంచి ఆశించడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే..ఎస్ఐఆర్‌పై పార్లమెంటు దద్దరిల్లింది. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో వాయిదాల పర్వం నడిచింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసాం..అని చెప్పుకోవడానికి తప్ప మరోటి కాదు. అందుకే తొలిరోజే.. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుపడుతూ ప్రతిపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. ఇలా వారు అధికారంలో ఉ న్నప్పుడు బిజెపి కూడా చేసిన తతంగమే. ఇది కూడా తమ పోరాటంగా వారు భావిస్తున్నారు. పార్లమెంటు ను స్తంభింప చేయడం అన్నది ఓ విజయంగా భావిస్తున్నారు. సర్‌పై ఎలాగూ ప్రభుత్వం వెంటనే చర్చకు అనుమతించదు. ఎందుకంటే వాయిదా తీర్మానం అన్నది కొంపలు మునిగే సమయంలో మాత్రమే అనుమతిస్తారు. అందుకే విపక్షాలు ఇచ్చిన తీరర్మానాన్ని స్పీకర్ ఓంబిర్లా తిరస్కరించడంతో వేదిక వద్దనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దంటూ నినదించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ అన్ని అంశాలపై చర్చకు సిద్ధమే నని స్పష్టం చేశారు. ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదని స్పష్టం చేశారు.. ఇలా రెండోరోజూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. గతంలో ఆదానీ విసయంలో కూడా ఇలాగే చేశారు. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం విజయమనుకుంటే ప్రజలకు జవాబు చెప్పాలి. పార్లమెంట్ అన్నది ప్రజల సొత్తు. కవలం 20,30 మంది ఎంపిలది కాదని గుర్తించాలి. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశంపై అత్యవసర చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తున్నామని, అత్యవసర చర్చ సాధ్యం కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అయినా ఆందోళన చేస్తున్నారంటే రాజకీయం తప్ప మరోటి కాదు. ఇలాంటి విపక్షాల వల్లనే పార్లమెంటులో ఏ సమస్యా చర్చకు రావడం లేదు. ప్రభుత్వం కూడా ఇదే కోరుకుంటోంది. చర్చలు జరిగితే వారి వ్యవహారం కూడా బయట పడుతుంది. అయితే చర్చల కోసం సక్రమమైన పద్దతిలో విపక్షాలు వ్యూహాత్మకంగా వ్యవహరించనంత కాలం రచ్చ సాగుతూనే ఉంటుంది.

## గంజాయి డాన్ కామాక్షమ్మకు చెక్

**- ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం**



**నెల్లూరు,డిసెంబర్ 2( వెలుతురు):**

నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులతోపాటు సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మతోపాటు అమె బంధువులు, అనుచరుల నివాసాలను స్థానికులు కూలగొట్టారు

## రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

**- అదృశ్యంపై కేసులో సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 2( వెలుతురు):**

రోహింగ్యా శరణార్థులను వెనకేసుకుని వచ్చేలా పిటిషన్ దాఖలు చేయడంపై సుప్రీం ఆగ్హం వ్యక్తం చేసింది. రోహింగ్యాల అదృశ్యంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టుకీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి.. న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది. రోహింగ్యాలు అదృశ్యమవుతున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'వారికి రెడ్‌కార్పెట్ వేసి.. ఆహ్వానించాలని మీరు కోరుకుంటున్నారా' అని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించింది. రోహింగ్యాలు సొరంగ మార్గాల ద్వారా భారత్‌లోకి వచ్చి.. ఆహారం, ఆశ్రయం వంటి హక్కులను డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. 'ఉత్తర భారతదేశంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే.. వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా?' అని వ్యాఖ్యానించింది.

## కర్నాటకలో బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు

**- డికె ఇంటికి వచ్చి అల్పాహారం చేసిన సిద్దు**
**- అధిష్టానం కోరుకుంటే డికె సిఎం అవుతారని కామెంట్**



**బెంగళూరు,డిసెంబర్ 2( వెలుతురు):**

కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఊహాగానాల వేళ బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు తెరపైకి వచ్చాయి. సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారం వేళ రెండు రోజుల క్రితం సీఎం సిద్ధరామయ్య నివాసానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు డీకే ఇంటికి సీఎం సిద్ధూ బ్రేక్‌ఫాస్ట్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఇంటికి వచ్చిన సీఎంకు డీకే ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం దిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి.. అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులోభాగంగానే నేడు మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు.

## ఇమ్రాన్ పరిస్థితిపై ఆందోళన

**- రోడ్డుపైకి వచ్చిన పార్టీ కార్యకర్తలు**
**- రావల్పిండిలో ఆందోళనలు..నిషేధాజ్ఞలు అమలు**




**లాహోర్,డిసెంబర్ 2( వెలుతురు):**

పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు వస్తోన్న వార్తల నేపథ్యంలో పాక్‌లో ప్రజాందోళన మిన్నంటింది. ఇమ్రాన్ ఖాన్‌ను ఎందుకు దాస్తున్నారంటూ ప్రజలు రోడ్డెక్కింది ఆందోళనకు దిగారు. దీంతో రావల్పిండిలో తీవ్ర ఉద్రిక్త పరిస్తితులు ఏర్పడ్డాయి. అయితే ఇమ్రాన్ మృతిని ఆ దేశ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు ఆయన కుటుంబసభ్యులను అనుమతించకపోవడం, అతని ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మంగళవారం మాజీ ప్రధానికి అనుకూలంగా భారీ ర్యాలీకి రంగం సిద్ధం చేశారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని గ్రూపులు రావల్పిండిలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్‌ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఆయన సురక్షితంగా ఉన్నారా, లేదా? ఆరోగ్యంగా ఉన్నారా, మరణించారా అనే విషయాలు వెల్లడించకుండా జైలు అధికారులు తమను మానసికంగా హింసిస్తున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. తమ తండ్రిని చూసేందుకు అనుమతించట్లేదన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తమకు ఎలాంటి సమాచారం అందట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలన్నర రోజుల నుంచి ఆయనను ఎవరూ కలవకుండా 'డెత్ సెల్'లో ఒంటరిగా నిర్బంధించినట్లు వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి. బలూచిస్థాన్ రెబల్స్‌కు చెందిన 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకువెళ్లి ఆయనను కలిసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అందుకు అనుమతించకుండా.. తమపై విచక్షణారహితంగా దాడి చేశారని వారు వాపోయారు. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ఆరా

**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**

ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్' ను మంగళవారం డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపుదిద్దుకునే ఈ కీలక కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పన పురోగతితో పాటు ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై భట్టి విక్రమార్క వివరంగా చర్చించారు. సమ్మిట్ విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటైన పలు కమిటీల పనితీరు, బాధ్యతలు, ఇప్పటి వరకు పూర్తయిన వర్క్ ఎ+ం-లోపై అధికారులతో సమీక్షించారు. ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, వేదిక, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, ప్రోగ్రామ్ నిర్వహణ, కల్చరల్ ఈవెంట్స్, కమ్యూనికేషన్, డిజిటల్ మీడియా కమ్యూనికేషన్ వంటి కీలక విభాగాల కమిటీ అధ్యక్షులు, టీమ్ సభ్యులతో ప్రత్యేక భేటీలు నిర్వహించిన డిప్యూటీ సీఎం, ప్రతి విభాగంలో జరుగుతున్న పనిని విడివిడిగా సమీక్షించారు. సమీక్ష తర్వాత వార్ రూమ్‌లో పనిచేస్తున్న ప్రతి బృంద సభ్యుల వద్దకు స్వయంగా వెళ్లి, జరుగుతున్న పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వసతి ఏర్పాట్లు వంటి విషయాలను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం, నాణ్యత, స్పష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి గత కొన్ని రోజులుగా వరుసగా వార్ రూమ్‌కు వచ్చి, విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై విచారణలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. రేపటి నుంచే రాష్ట్ర మంత్రులు వార్ రూమ్‌ను సందర్శించి జరుగుతున్న పనులను పర్యవేక్షించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీ చెప్పిందే నిజమవుతోంది

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందువులను, హిందూ దేవుళ్లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. కాంగ్రెస్ ముమ్మాటికీ మజ్లిస్ పార్టీకి కొమ్ముకాసే పార్టీ. ముస్లిం అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే ముస్లిం పార్టీ అని రేవంత్ రెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనం. కాంగ్రెస్ నరనరాల్లో హిందూ ద్వేషం నిండుకుంది. బీఆర్ఎస్ సైతం గతంలో పలుమార్లు హిందూ దేవుళ్లను, హిందూ సంప్రదాయాలని కించపర్చింది. ఆనాడు సీఎంగా ఉంటూ కేసీఆర్ హిందూగాళ్లు బొందూగాళ్లు అంటూ హిందువులను అవ హేళన చేశారు. ఈ విషయాన్ని ముందే పసిగట్టి మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ గెలిస్తే హిందువులు తలెత్తుకుని బయట తిరగలేని ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించాం. సీఎం వ్యాఖ్యలను చూశాక ఇదే నిజమని తేలిపోయింది. హిందువులపట్ల, హిందూ దేవుళ్ల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ద్వేషం బట్టబయలైంది. హిందూ సమాజం ఇకనైనా ఆలోచించుకోవాలి. ఓట్ల కోసం చీలిపోయి విడివిడిగా ఉంటూ అవహేళనను, అవమానాన్ని దిగమింగుకుంటూ ఉంటారో....లేక ఏకమై హిందువుల సత్తాను చాటుతారో తేల్చుకోవాలి. బీజేపీ ఏనాడూ ఇతర మతాలను కించపర్చలేదు. కించపర్చే ఉద్దేశమూ బీజేపీకి లేదు. అన్ని మతాలను గౌరవించే పార్టీ భారతీయ జనతా పార్టీ. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" దిశగా పనిచేస్తోంది. ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరుతున్నా.

## ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండని సీఎం విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడిందన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డవి పాల్వంచలోనేనని చెప్పారు. 60 ఏండ్ల ఉద్యమం నడవడానికి కారణం ఈ పాల్వంచనే అని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ కోసం వేలాది ఎకరాలు భూమి ఇచ్చారని చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధికి కారణం కాంగ్రెస్ అన్నారు రేవంత్. నాగార్జున సాగర్,శ్రీశైలం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నెహ్రూ కట్టినవేనని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కృష్ణా,గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా తడవాలన్నారు. ఎడ్యుకేషన్ కు సంబంధించి ప్రతీ అవకాశాన్ని జిల్లాకు ఇస్తున్నామన్నారు. పదేండ్లు పాలించినోళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనదన్నారు. సర్కార్ ఏ సంక్షేమ పథకం మొదలు పెట్టినా..ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని.. సన్నబియ్యం,రేషన్ పంపిణీ ఈ జిల్లా నుంచే ప్రారంభించామన్నారు. మా ఓటే ఆయుధంగా మారి ప్రజాపాలన అందిస్తున్నాం. మంచోడినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని.. మందుకో..డబ్బుకో ఓటేస్తే ఊరు మునుగుతుందని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,ఎంపీలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

వివిధ రాష్ట్రాలకు వెళ్లి సీఎంలను ఆహ్వానించనున్నారు. రాష్ట్ర ఎంపీల బృందం.. ఢిల్లీ సీఎం, కేంద్రమంత్రులు, గవర్నర్లను ఆహ్వానించనుంది. ఈ మేరకు మంత్రులకు ఆహ్వాన బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి - జమ్ముకశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలకు వెళ్లి సీఎంలను ఆహ్వానిస్తారు. దామోదర్ రాజనర్సింహ - పంజాబ్, హరియాణాలకు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి - ఆంధ్రప్రదేశ్ శ్రీధర్‌బాబు - కర్ణాటక, తమిళనాడు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి - ఉత్తర్‌ప్రదేశ్, పొన్నం ప్రభాకర్ - రాజస్థాన్ కొండా సురేఖ - ఛత్తీస్‌గఢ్, సీతక్క - పశ్చిమ బెంగాల్, తుమ్మల నాగేశ్వరరావు - మధ్యప్రదేశ్, జూపల్లి కృష్ణారావు - అస్సాం, వివేక్ - బిహార్, వాకిటి శ్రీహరి - ఒడిశా, అడ్లూరి లక్ష్మణ్ - హిమాచల్‌ప్రదేశ్, మహ్మద్ అజారుద్దీన్ -మహారాష్ట్ర సీఎంలను ఆహ్వానించనున్నారు.

## నడ్డాకు సిఎం, డిప్యూటి సిఎంల శుభాకాంక్షలు

ప్రార్థిస్తున్నట్లు ట్వీట్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఆయన పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'మీ నాయకత్వంలో భాజపా అనేక ఎన్నికల్లో విజయాలు సాధించింది. దేశవ్యాప్తంగా పార్టీ మరింత బలోపేతమైంది. మీ నాయకత్వ పటిమ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల నిబద్ధత లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రధాని కార్యాలయం సౌత్ బ్లాక్ పేరు మార్పు

ఉత్తర్వులు జారీ చేయడంతో పేరును మార్చారు. ప్రధాన మంత్రి కార్యాలయం భవనం పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. దశాబ్దాలుగా సౌత్ బ్లాక్ లో కొనసాగుతున్న ప్రధాన మంత్రి కార్యాలయాన్ని ఆధునీకరించి దాని పేరును సేవా తీర్థ్ గా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గవర్నర్ల అధికారిక నివాసం రాజ్ భవన్ ను లోక్ భవన్ గా మార్చాలని కేంద్రం సూచించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పశ్చిమబెంగాల్,తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా రాజ్ భవన్ లను లోక్ భవన్ లుగా మార్చారు. ఇపుడు తెలంగాణ రాజ్ భవన్ పేరు మారింది.

## అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

తరలించాం. తుఫాను అనంతరం ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున వెంటనే రూ.3,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం పంపిణీ చేసింది. అదేవిధంగా, కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా వంటి అత్యవసర చర్యలు చేపట్టినట్లు లోకేశ్ వివరించారు. అత్యవసర అవసరాల నిమిత్తం రూ.60 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే ఢిల్లీలో ఏపీ మంత్రి లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరున్న జీఎంఆర్ సంస్థ కు చెందిన సీనియర్ అధికారులతో మంత్రి లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. విశాఖ ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి చెందితే విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల.. విద్య, శిక్షణకు హబ్‌గా మారుతుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ ఛేంజర్‌గా మారడంతో పాటు ఏపీ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## హిల్ట్ పాలసీపై మంత్రి శ్రీధర్ బాబు 2025 డిసెంబరు 01న మాట్లాడిన అంశాలకు బి.జె.ఎల్.పి నేత మహేశ్వర్ రెడ్డి స్పందన

కాలుష్యాన్ని నివారించేందుకే ఈ హిల్ట్ పాలసీ అంటూ మంత్రి గారు మరోసారి సెలవిచ్చారు మంత్రి శ్రీధర్ బాబు హిల్ట్ పాలసీపై మేం లేవనెత్తిన చాలా అంశాలకు సమాధానాలు చెప్పకుండా దాటవేయడం ముమ్మాటికీ బాధ్యతారాహిత్యమే. ప్రతిపక్షాలు, పర్యావరణ వేత్తలు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయకుండా అధికారం ఉంది కదా అని, ప్రభుత్వం ఇష్టానుసారంగా పరిశ్రమల భూములను అడ్డికి పావుశేరు మాదిరిగా అగ్గువకే కన్వర్షన్ చేయడం ముమ్మాటికీ ల్యాండ్ లూటీకి పాలసీనే. ఈ 22 పారిశ్రామిక వాడల్లోని భూముల్లో రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇచ్చినవి ఎన్ని ఎకరాలు, ఇండస్ట్రియలిస్టులు అప్పటి ఐఐసి ధరల ప్రకారం కొనుగోలు చేసినవి ఎన్ని ఎకరాలు, ఈ పరిశ్రమల్లో కాలుష్యకారకమైనవి ఎన్ని ఉన్నాయి. వాటి వల్ల ఎలాంటి దుష్పరిణామాలు సంభవిస్తున్నాయనే అంశంపై పర్యావరణ నిపుణుల నివేదిక ఏమైనా ప్రభుత్వం వద్ద ఉందా? ఎన్విరాన్ మెంటల్ స్టడీ ఏమైనా చేసారా? ఏ ప్రాతిపదికన ఈ పరిశ్రమలన్నీ కాలుష్య కారకాలని ప్రభుత్వం నిర్ధారించింది.

లీస్ హోల్డ్ లో ఉన్న పరిశ్రమలు ఎన్ని...?

కేస్ to కేస్ కన్వర్షన్ అంటే అన్ని పరిశ్రమలు తరలించే యోచన..లేదా మరి తరలించని పరిశ్రమల పక్కన హౌసింగ్ కాలనీలు ఎలా నిర్మిస్తారు. తరలిపోయే పరిశ్రమలకు మరి స్థలాలు ఎక్కడ చూపించారు.ఇలా అన్ని రియల్ ఎస్టేట్ ల్యాండ్స్ కన్వర్షన్ చేస్తే మళ్ళీ వారు ఇండస్ట్రీ నిర్మిస్తారా..? మరి పరిశ్రమల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుమతివ్వడం సమంజసమేనా, కాలుష్య కారక భూముల్లో అపార్టుమెంట్ల నిర్మాణం జరిగితే, అక్కడ నివసించబోయే ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం లేదా? ఏవైనీ కంపెనీలు తాము ఓఆర్ఆర్ ఆవలకు తరలించలేమంటే వారికి మినహాయింపును ఇస్తారా... అలా ఇచ్చినట్టయితే కాలుష్యం పెరిగిపోదా పరిశ్రమల ప్రోత్సాహం కోసం ఇచ్చిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుమతిచ్చిన తర్వాత ఆ ఇండస్ట్రియలిస్టులు మళ్లీ ఓఆర్ఆర్ ఆవల భూములను కొనుగోలు చేసి పరిశ్రమలను ఏర్పాటు చేస్తారనే గ్యారంటీ ఏంటి? హిల్ట్ పాలసీ వల్ల ఉన్న పరిశ్రమలు అంతరిస్తాయే తప్ప కొత్త పరిశ్రమలు ఎలా వస్తాయో ప్రభుత్వ పెద్దలు సెలవివ్వాలి. మనుగడలో ఉన్న పరిశ్రమలు మూతపడితే, వాటిలో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు కోల్పోతారు కదా, మరి ఇది నిరుద్యోగ సమస్యను పెంచడమే కదా? ఉద్యోగుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ ఆవలకు తరలించాలంటే, వాటికి అక్కడ భూములను కేటాయించాలి. నగరంలోని పరిశ్రమల భూములను ప్రభుత్వం తీసుకుని, వాటికి ఓఆర్ఆర్ ఆవల ఉన్న పారిశ్రామక వాడల్లో ప్రభుత్వమే ల్యాండ్ టు ల్యాండ్ పద్ధతిలో భూములను కేటాయించినట్టయితే ఆ పరిశ్రమలను ఇండస్ట్రియిలిస్టులు కొనసాగించడానికి ఆస్కారముంటుంది కదా. అలా కాకుండా కేవలం రూ.ఐదు వేల కోట్ల నిధుల కోసం పారిశ్రామిక భూముల కన్వర్షన్ విధానానికి ప్రభుత్వం ఎందుకు తెరతీసింది. గతంలో బీఆర్ఎస్ సర్కార్ కూడా హైదరాబాద్ GRID పాలసీ (Growth in Dispersion) తెచ్చి, నగరంలోని అజామాబాద్, కూకట్‌పల్లి, హాఫీజ్‌పేటలోని పారిశ్రామిక భూములకు ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించిందని, సిరీస్ ఫార్మా కంపెనీకి వంద ఎకరాల భూమిని ఫ్రీ హోల్డ్ ఇచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. బీఆర్ఎస్ సర్కారు ఇలా ఫ్రీ హోల్డ్ పేరిట ఎకరాకు రూ.50 కోట్ల నుంచి రూ.60కోట్లకు ఉన్న విలువైన భూములను ఎకరాకు రూ.10 కోట్లకే కట్టబెట్టారని, ఆరోపిస్తున్న కాంగ్రెస్ సర్కార్ ... అపుడు బీఆర్ఎస్ సర్కార్ GRID పాలసీ తెచ్చి పారిశ్రామిక వాడల్లోని భూముల ఓనర్లకు ఫ్రీ హోల్డ్ ఇస్తూ భూ దోపిడీకి పాల్పడింది, కాబట్టి ఇపుడు తాము హిల్ట్ పాలసీ ద్వారా అదే ల్యాండ్ లూటీకి పాల్పడుతామని చెప్పదలుచుకుందా ... బీఆర్ఎస్ హయాంలో GRID పాలసీ ద్వారా జరిగిన అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకని బయట పెట్టడం లేదు.ఇది బీఆర్ఎస్, కాంగ్రెసుల మధ్య ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం కాదా ... ఇండిస్ట్రియల్ ల్యాండ్ లూటీ ఎపిసోడుకు బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే, కాంగ్రెస్ ఇపుడు తలుపులు తెరవడం కాదు, ఏకంగా గోడలనే కూల్చేస్తోందన్నమాట. గొర్రెలను తినేటోడు పోయి బర్రెలను తినేటోడు వచ్చిండన్నమాట. బీఆర్ఎస్ అవినీతి బాటలో కాంగ్రెస్ సర్కారు నడుస్తోందని బిజెపి ఎండగడుతోంటే, మంత్రి శ్రీధర్ బాబు బీఆర్ఎస్, బిజెపి కలిసి కాంగ్రెస్ సర్కారును అడ్డుకుంటున్నాయంటూ తన రాజకీయ తెలివితేటలన్నీ ఉపయోగించి మాట్లాడుతున్నారు. పాలసీపై వివరణ ఇవ్వకుండా ఇలాంటి చిల్లర ఆరోపణ చేయడం మంత్రి శ్రీధర్ బాబు దివాళాకోరుతనానికి నిదర్శనం. ఈ పరిశ్రమలు 50 ఏళ్లుగా విడుదల చేస్తున్న రసాయనిక వ్యర్థాలు భూమిలో ఇంకిపోవడం వల్ల ఈ ప్రాంతాల్లో అపార్ట్మెంట్ల నిర్మాణానికి అనుమతించినట్టయితే %ా% విషతుల్యమైన భూగర్భ జలాల వల్ల అక్కడ నివసించనున్న ప్రజలకు అనారోగ్య సమస్యలు రావా? ఇలాంటి అంశాలపై లోతైన అధ్యయనం ప్రభుత్వం ఏమైనా చేసిందా? ఎలాంటి ఎన్విరాన్మెంటల్ స్టడీ చేయకుండా కాలుష్యకారక పరిశ్రమల స్థానంలో నివాసాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎలా అనుమతి ఇస్తుంది. ఇది ప్రజారోగ్యంతో చెలగాటం కాదా? HILT పాలసీలో ల్యాండ్ కన్వర్షనుకు టీజీఐఐసీ ధరలను కాదని, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరల్లో 30 శాతానికే అనుమతివ్వడం ఎంత వరకు సమంజసం. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరలతో పోల్చితే టీజీఐఐసీ ధరలు మూడింతలు ఎక్కువగా ఉన్నాయి. అంటే ప్రభుత్వం అడ్డికి పావుశేరు చందంగా అగ్గువకే ల్యాండ్ కన్వర్షనుకు అనుమతివ్వడం వెనకున్న మతలబేంటి. కుంభకోణం కాదా? హైదరాబాదులోని 22 పారిశ్రామిక వాడల్లో ఉన్న భూముల ధర సగటున ఎకరం సుమారు రూ.68 కోట్లుగా ఉంటుందని అంచనా. ఆ మేరకు ప్రభుత్వం కన్వర్షన్ చేస్తున్న 9,292 ఎకరాలకు మార్కెట్ ధర ప్రకారం వచ్చే మొత్తం రూ.ఆరు లక్షల 29 వేల కోట్లు. ఈ భూములను S.R.O. వ్యాల్యూలో 30 శాతానికే ల్యాండ్ కన్వర్షనుకు అనుమతి ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి రూ.ఐదు వేల కోట్లని మంత్రి శ్రీధర్ బాబు గారే చెప్పారు. అంటే ఎకరం సగటున రూ.68 కోట్ల విలువ చేసే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఎకరం రూ.54 లక్షలకు ఇండస్ట్రియలిస్టులకు కట్టబెట్టాలనుకోవడంలో ఉన్న మతలబు రూ.లక్షల కోట్ల అవినీతి కాదా. ప్రభుత్వానికి ఆదాయ వనరులను పంచుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సిఫారసులతోనే హిల్ట్ పాలసీ వచ్చిందని మంత్రులు చెప్పారు. ఏడాదిన్నర పాటు మంత్రివర్గ ఉప సంఘం కసరత్తు చేసి హిల్ట్ పాలసీని రూపొందించిన అంశాన్ని జీవో-27లో ఎందుకు పొందుపరచలేదు. 45 రోజుల్లో ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియ ముగియాలని టార్గెట్ పెట్టుకోవడం వెనకున్న ఉద్దేశమేంటి. హిల్ట్ పాలసీపై సమగ్ర చర్చ కోసం అసెంబ్లీని సమావేశ పరచాలన్న ప్రతిపక్షాల డిమాండును ప్రభుత్వం ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులైన కొందరు పారిశ్రామిక వాడల్లో భూములన్న ఇండస్ట్రియలిస్టులతో ముందుగానే వారి భూముల్లో నిర్మాణాల కోసం అగ్రిమెంట్లు కుదుర్చు కున్నారని, ఆ తర్వాతే HILT పాలసీని క్యాబినెటు ఆమోదించిందని, ఈ వ్యవహారం వెనక క్విడ్ ప్రో కో, ఇన్ సైడర్ ట్రేడింగ్ వంటి స్కాములున్నాయనే ఆరోపణలున్నాయి. అందుకే ఈ పాలసీపై లోతైన చర్చ కోసం తక్షణమే అసెంబ్లీని సమావేశ పరచడంపై శాసనసభా వ్యవహారాల మంత్రి అయిన శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించాలి.

## తెలంగాణ విజన్ డాక్యుమెంట్ - 2047లో మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధికి పెద్ద పీట

అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజ, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పాల్గొన్నారు. సమావేశంలో మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు సంబంధించి విభిన్న అంశాలపై మంత్రి సీతక్క పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతంగా ఉందని..దాన్ని 2047 నాటికి 95 శాతానికి చేరేలా విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేయాలని సూచించారు. మహిళల ఉపాధి - ఉద్యోగ అవకాశాలను విస్తృతంగా పెంచేందుకు సమగ్రమైన వ్యూహం ఉండాలని ఆమె స్పష్టం చేశారు. మహిళల సంరక్షణ, పోషకాహారం ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేసే లక్ష్యంతో విభిన్న వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహించేలా విజన్ 2047 డాక్యుమెంట్ ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా యూనిఫాంలు కుట్టించడాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది మహిళా సంఘాలకు రూ. 30 కోట్లు పైగా ఆదాయం లభిస్తోందని చెప్పారు. ప్రైవేట్ రంగంలో కూడా మహిళా సంఘాల నైపుణ్యాన్ని వినియోగిస్తూ, ముఖ్యంగా ప్రైవేట్ స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థుల యూనిఫామ్ తయారీ పనులు మహిళా సంఘాలకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే 2047 విజన్ ప్రకారం అన్ని మహిళలకు యూనివర్సల్ చైల్డ్ కేర్, యూనివర్సల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆమె పేర్కొన్నారు. అయితే విజన్ 2047లో మహిళా సాధికారతకు సంబంధించిన కీలక అంశాలు... ప్రజా ప్రభుత్వం అమలు చేయనున్న ప్రధాన చర్యలు కింది విధంగా ఉన్నాయి.

విజన్ 2047 – మహిళతోనే తెలంగాణ ప్రగతి

తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం 'కోటి మంది మహిళలను కోటీశ్వర్లు' చేసే కార్యక్రమాన్ని కీలకంగా తీసుకుని, ప్రతి మహిళకు ఆర్థిక భద్రత, డిజిటల్ జ్ఞానం, వ్యాపార అవకాశాలు, గ్లోబల్ మార్కెట్ చేరుకోవడానికి సహాయం చేసే చర్యలు ప్రారంభించింది.

ప్రభుత్వం తీసుకుంటున్న ముఖ్యమైన చర్యలు

విద్య, భద్రత

బాలికలు విద్య పూర్తి చేసేలా స్కాలర్‌షిప్‌లు, రవాణా సౌకర్యాలు కల్పిస్తోంది. ఫైనాన్షియల్ – డిజిటల్ జ్ఞానం, చిన్న వ్యాపార నైపుణ్యాలు నేర్పుతోంది.

బాల్య వివాహాలు ఆపేందుకు, లింగ సమానత్వంపై అవగాహన పెంచుతోంది.

ఉద్యోగం, వ్యాపారం కోసం సహాయం

మహిళలు పని చేసే చోట పిల్లల కోసం నాణ్యమైన క్రెచ్‌లు ఏర్పాటు.

మహిళల వ్యాపారాలకు అవసరమైన అనుమతులు, సేవలు ఒక్కే వేదికలో అందుబాటులోకి.

SHG లావాదేవీలను డిజిటైజ్ చేసి బ్యాంకు రుణాలు సులభంగా అందేలా చేస్తోంది.

గ్లోబల్ మార్కెట్ అవకాశాలు

WE-Hub, T-Hub సహకారంతో మహిళా స్టార్టప్స్ ను విదేశీ మార్కెట్‌లకు తీసుకెళ్లే లా ప్రణాళికలు

పరిశ్రమలు, ఉపాధి

మహిళల కోసం ప్రత్యేక పరిశ్రమ క్లస్టర్లు.

డిజైన్ ల్యాబ్‌లు, GI ఉత్పత్తులకు గ్లోబల్ సర్టిఫికేషన్.

టెక్స్టైల్, పర్యాటకం, సోలార్, ఆగ్రో–ఫుడ్ రంగాల్లో మహిళల కోసం ప్రత్యేక ప్రోత్సాహం.

సురక్షిత రవాణా, మంచి పాలన

మహిళల కోసం సురక్షిత రూట్లు, ప్రత్యేక రవాణా సేవలు.

రహదారులపై లైటింగ్, పర్యవేక్షణతో సేఫ్టీ గ్రిడ్ వ్యవస్థ.

మహిళా మిషన్ ద్వారా మహిళల అభివృద్ధిని పర్యవేక్షించే కొత్త వ్యవస్థ.

ఇన్నోవేషన్, ఉపాధి, మద్దతు

మహిళల కోసం ప్రత్యేక ఫెలోషిప్‌లు, స్టార్టప్ ప్రోత్సాహం.

ఉద్యోగాలకు తిరిగి చేరే మహిళలకు శిక్షణ, పన్ను రాయితీలు.

వర్కింగ్ విమెన్ హాస్టెల్స్, ఫ్లెక్సిబుల్ వర్క్ సౌకర్యాలు.

వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధ మహిళలకు జీవనోపాధి అవకాశాలు

దివ్యాంగుల కోసం ప్రత్యేక చర్యలు

చిన్నప్పుడే గుర్తింపు, కుటుంబాలకు మార్గదర్శనం.

టెలి కౌన్సిలింగ్, సపోర్ట్ గ్రూపులు.

జిల్లా రీహాబిలిటేషన్ కేంద్రాలు.

దివ్యాంగుల SHG లు, రుణ సదుపాయాలు.


పాఠశాలల్లో అడ్మిషన్ నిరాకరణకు నో–డినైల్ పాలసీ.

అసిస్టివ్ టెక్నాలజీ, యాక్సెసిబుల్ మౌలిక వసతులకు ప్రోత్సాహం.

ఇలా పలు రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం అందిస్తూ, మహిళా అభివృద్ధిని కేంద్రంగా చేసుకుని ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లడం వల్ల, 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ త్రి ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదుగుతుందనే నమ్మకం మరింత బలపడుతోంది.

## జనరల్ కోచ్‌లలోనూ దిండ్లు..బెడ్ షీట్లు

### - చైన్నై రైల్వే డివిజన్‌లో జనవరి నుంచి అమలు



**చెన్నై,డిసెంబర్ 2 వెలుతురు:**

రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్.. రైల్వే ప్రయాణికుల కోసం కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది రైల్వే శాఖ. ఇప్పటివరకు ఏసీ కోచ్ లలో మాత్రమే అందుబాటులో ఉన్న బెడ్ షీట్లు, పిల్లోస్ సౌకర్యం.. ఇప్పుడు నాన్ ఏసీ స్లీపర్ కోచ్ లలో కూడా అందుబాటులోకి రానుంది. తొలిసారి దక్షిణ రైల్వే పరిధిలోని చైన్నై రైల్వే డివిజన్ బెడ్ షీట్లు, పిల్లోస్ ను అందిస్తోంది. ఈ సౌకర్యాన్ని ఆన్ డిమాండ్ ఆన్ పేమెంట్ మోడ్ లలో పొందవచ్చు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిచే క్రమంలో దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ నాన్ ఏసీ కోచ్ లలో స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు జనవరి 1 నుంచి దిండ్లు, బెడ్ షీట్లు అందించనున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన పది రైళ్లలో మూడేళ్ల పాటు ఈ కొత్త సౌకర్యాలను అమలు చేస్తారు. గతంలో ఎసి కోచ్ లలో మాత్రమే ఈ సౌకర్యం ఉండేది. వర్షాకాలం, శీతాకాలంలో రిలాక్స్ , పరిశుభ్రమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించడమే లక్ష్యంగా రైల్వే శాఖ పనిచేస్తోంది. దీంతో ప్రయాణీకులకు సుదూర ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండనుంది. దుప్పట్లు, దిండ్ల నిర్వహణ పంపిణీని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. సేకరణ, యాంత్రిక వాషింగ్, ప్యాకింగ్, లోడింగ్, పంపిణీ ,నిల్వ - సేవా వ్యవధి అంతటా పరిశుభ్రత,సరఫరా చేయాల్సి ఉంటుంది. సుమారు రూ. 28.27 లక్షల వార్షిక లైసెన్స్ ఫీజులో ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తారు. దిండుతో కూడిన కవర్ ను రూ.30 కి, బెడ్ షీట్ కు రూ.20కి రెంట్ చెల్లించి తీసుకోవచ్చు. రెండూ కావాలంటే రూ. 50 లకు చెల్లించాల్సి ఉంటుంది. జనవరి 1 నుంచి మొత్తం పది రైళ్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. రాబోయే రోజుల్లో దేశ వ్యాప్తంగా అన్ని జోన్లలో ఈ సౌకర్యాన్ని అమలు చేసే అవకాశం ఉంది.


## కొత్త అకౌంట్ ద్వారానే ఎన్నికల ఖర్చులు

### - ఎన్నికలపరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా

**వికారాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**

అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు జరపాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా తమ రిధి మేరకు మాత్రమే ఖర్చు పెట్టాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్ణీత గడువు లోపల నామినేషన్లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులను సూచించారు. వికారాబాద్, నవాబ్ పెట్ మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను షేక్ యాస్మిన్ బాషా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అవసరమైన వారు హెల్ప్ డెస్క్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.

## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా



ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు వస్తాయి. రాష్ట్రంలో 5వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశంచేశారు. సమీక్షలో విద్యుత్ వ్యవస్థపై గత ప్రభుత్వ విధానాలు ప్రస్తావనకు వచ్చాయి. అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని గత పాలకులు అస్తవ్యస్తం చేశారని సీఎం చంద్రబాబు విమర్శించారు. పీపీఏ రద్దుతో రూ.9వేల కోట్ల భారాన్ని వైకాపా ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. విద్యుత్ వినియోగించ కుండానే ప్రజాధనాన్ని కంపెనీలకు చెల్లించిందని చెప్పారు. ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. . ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. గత అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్థం చేశారు. పీపీఏ రద్దుతో రూ. 9వేల కోట్ల భారాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోపింది. విద్యుత్ వినియోగించకుండానే ప్రజా ధనాన్ని కంపెనీలకు చెల్లించిందని విమర్శించారు.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

- ఆ ఉద్యోగులు కంప్యూటర్ పరీక్ష పాసవ్వాల్సిందే!
- ఈ మేరకు ప్రభుత్వం జీఓ నెం. 237 జారీ
- టైపిస్టులు, అసిస్టెంట్లు సహా పలు విభాగాలకు ఈ నిబంధన
- పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే చర్యలు తీసుకునే అవకాశం

**హైదరాబాద్,డిసెంబర్ 2 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని పెంచే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, వేగం పెంచే లక్ష్యంతో పలు



విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షను తప్పనిసరి చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నెం. 237ను జారీ చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం ఉద్యోగులు కంప్యూటర్ పరీక్షలో కచ్చితంగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ జీఓ ప్రకారం నిర్దేశిత కేటగిరీల ఉద్యోగులు కంప్యూటర్ పరీక్ష పాస్ కావడంతో పాటు ఆఫీస్ ఆటోమేషన్ యంత్రాల వినియోగంలో కూడా నైపుణ్యం ప్రదర్శించాలి. జూనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ కమ్ టైపిస్టులు, సీనియర్, జూనియర్ స్టెనోగ్రాఫర్లు, యూడీ, ఎల్డీ టైపిస్టులు వంటి క్లరికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వ దైనందిన కార్యకలాపాల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారిలో కొందరికి కంప్యూటర్ పరిజ్ఞానం తక్కువగా ఉండవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష ద్వారా ఉద్యోగులందరూ తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సి ఉంటుంది. ఫైళ్ల నిర్వహణ, డేటా ఎంట్రీ, కమ్యూనికేషన్ వంటి పనులు వేగవంతం కావడానికి ఇది దోహదపడుతుంది. పరీక్షలో ఉత్తీర్ణత సాధించని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. డిజిటల్ పాలనను పటిష్ఠం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ – 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ఎయిర్‌పోర్టులు తెచ్చామని గుర్తు చేశారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు.

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కోటి మంది మహిళలకు చీరలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చీరలు అందలేదంటూ ఫిర్యాదులు వస్తే అందుకు డీసీసీలదే బాధ్యత అంటూ సీఎం హెచ్చరించారు. డిసెంబర్ నెలాఖరులోగా మహిళలందరికీ చీరలు అందించాలని డీసీసీలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర పరిపాలన గురించి మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమ దిశగా ముందుకు తీసుకెళ్తున్నాం. కొత్త సర్పంచులు ఎన్నికయ్యే సందర్భంలో జిల్లా అధ్యక్ష పదవులు రావడం మీకు గొప్ప అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సులు వంటి సంక్షేమ పథకాలపై చర్చ పెట్టాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. కేసీఆర్ ఇచ్చిన చీరలు పనికిరావని ప్రజలు నిందించారు. కానీ, మనం నిజాయితీతో కోటి మందికి చీరలు ఇస్తున్నాం. ఏ ఆడబిడ్డ కూడా చీర దక్కకుండా ఉండకూడదని తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా చీరలు అందజేయకపోతే అది జిల్లా కాంగ్రెస్ కమిటీల బాధ్యత అవుతుందని హెచ్చరించారు. అలాగే అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడుతూ.. నాచారం ప్రాంతంలోని పరిశ్రమలను పట్టణం వెలుపలకు మార్చాలని, ఇందుతో మధ్యతరగతి కుటుంబాలు భూములు కొనుగోలు చేయగలవని, పేదలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన డిసెంబర్‌లో జరుగుతుందని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రానికి బుల్లెట్ ట్రైన్ ఎందుకు ఇవ్వడం లేదని మోదీని ప్రశ్నిస్తానని, ఇస్తే.. ప్రజలకి మంచిది, ఇవ్వకపోతే తెలంగాణ ప్రజల రియాక్షన్ బీజేపీ చూస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడుతూ.. రాజకీయాల్లో కాళ్లకు కట్టెలు పెట్టడం సహజం. కానీ అక్కడే ఆగిపోవద్దు, ముందుకు సాగాలని కార్యకర్తలకు హితబోధ చేశారు. తాను సీఎం అయ్యేముందు కొంతమంది పై కోపం ఉన్నా, ఇప్పుడు పనిపై దృష్టి పెట్టి సైలెంట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో విభిన్న మనస్తత్వాలు ఉన్నప్పటికీ, మంచి అభిప్రాయం, మంచి ఉద్దేశాలు మాత్రం ఏకంగా ఉండాలని సూచించారు. ఇక చివరలో.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే. నేను సీఎం కావచ్చు, కానీ ఆ పదవులు పొందడం నిజమైన కష్టమే. ఆ విలువ మీకు తెలుసు. అందరం కలిసే పని చేసినప్పుడే కాంగ్రెస్ బలపడుతుందని అన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన గ్లోబల్ సమ్మిట్ వేదిక పనులు

- అవసరమైతే మూడు షిఫ్టుల్లో పనులు చేయండి
- అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు
- వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



**హైదరాబాద్,డిసెంబర్ 2 వెలుతురు:**
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదిక వద్ద పనులు చురుకుగా సాగాలని, అవసరమైతే మూడు షిఫ్టుల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. . మరికొద్ది రోజుల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదికగా జరగనుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా.. తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ఈ సమ్మిట్ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి డి.శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న ఈ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా పరిశీలించారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించారు. పలు దేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్, అతిథులు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ వేదిక వద్ద నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. డిసెంబర్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేసి.. 6వ తేదీన డ్రై రన్ కండక్ట్ చేయాలని ఉన్నతాధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హైదరాబాద్ తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అలాగే భద్రతను సైతం కట్టుదిట్టం చేస్తుంది. అందుకోసం డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.





ఐక్యత
పోరాటాలు
సాధన

TUWJ
TELANGANA STATE UNION OF WORKING JOURNALISTS

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై....

డిసెంబర్ 3న మహా ధర్నా



మన న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి పోరుబాట పట్టాలని నవంబర్ 6, 2025న జరిగిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఇందులోభాగంగా **మాసాబ్ ట్యాంక్, హైద్రాబాద్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద డిసెంబర్ 3వ తేదీ, ఉదయం 10 గంటలకు మహా ధర్నా** నిర్వహించాలని టీయుడబ్ల్యూజే నిర్ణయించింది. మన డిమాండ్ల సాధన కోసం ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి జర్నలిస్టులు పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**మన డిమాండ్లు:**

1. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలి.
2. ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి.
3. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి.
4. వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలి.
5. సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలి.

ఉద్యమాభివందనాలతో...

కె. విరాహత్ అలీ
రాష్ట్ర అధ్యక్షుడు

కె. రాంనారాయణ
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే)
(Regd. No. H-9/2014, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అనుబంధం)

## బీసీ రిజర్వేషన్లు పెంచాలని గాంధీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వరుకు సంఘీభావం ప్రకటించిన బీసీ జేఏసీ, ఓయు జేఏసీ

- బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే పార్టీల భరతం పడతాం
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గాంధీ ఆసుపత్రిలో ఐదవ రోజు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వరుని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు కలిసి సంఘీభావం ప్రకటించారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను దగా చేశాయని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ప్రకటించి ఈరోజు ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం చాలా బాధాకరమని అన్నారు. చివరి వరకు బీసీలను ఆశపెట్టి ఆశల పల్లకిలో మోస్తూ ఒకటేసారి బీసీల ఆశల మీద నీళు చల్లారని ఒక్కనాడు అయినా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంట్లో ఈ యొక్క అంశాన్ని లేవనెత్తలేదని ఓటు చోరీ అని తిరుగుతున్న రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్లమెంట్లో బిజెపి ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదన్నారు. కార్యక్రమంలో ఓయూ జెఏసి చైర్మన్ పొన్నం ముత్యం గౌడ్,బీసీ విద్యార్థి ఓయు ఇంచార్జ్ గోదా రవీందర్, టిజిఆర్ఎస్ఏ చైర్మన్ దూడపాక సురేష్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు

## జనరల్ స్థానాల్లో బీసీలు సర్పంచ్ లుగా పోటీ చేసి గెలిచి బీసీల సత్తా చాటాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ పిలుపు



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేసే బీసీలు ఆయా పార్టీలు బలపరిచిన బలపరచకున్న జనరల్ స్థానాల్లో బరిలో నిలిచి గెలిచి బీసీల సత్తా చాటాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు.గ్రామాలలో జనరల్ స్థానం అంటే అది కేవలం అగ్రకులాలకు రిజర్వేషన్ చేసినట్లుగా ఫీలవుతున్నారని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. జనరల్ స్థానం అంటే అది అగ్రకులాలకి పేటెంట్ అయినట్టు మాట్లాడుతున్నారని ఆయా పార్టీలు కూడా జనరల్ స్థానాలలో అగ్రకులాలకు చెందిన వ్యక్తులనే బలపరుస్తున్నారని అన్నారు.గ్రామాలలో ఉన్న బీసీలందరూ కలిసికట్టుగా ఒక జట్టుగా ఏర్పడి జనరల్ స్థానాల్లో బీసీలు అగ్రకులానికి చెందిన వారు నిలబడితే పార్టీలను పక్కనపెట్టి బీసీలనే గెలిపించుకోవాలని లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గూడూరు భాస్కర్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు బండిగారి భరత్ పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ పై లోకాయుక్తలో ఫిర్యాదు



**బషీర్ బాగ్ వెలుతురు 2 డిసెంబర్ :**
వనపర్తి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాధ్ పై రాష్ట్ర లోకాయుక్తలో బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ ఫిర్యాదు చేశారు. బషీర్ బాగ్ లోని లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన అనంతరం రాచాల యుగంధర్ మాట్లాడుతూ. జిల్లాలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై ఆధారాలతో సహా లోకాయుక్త లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మిషనరీ , కరెంట్ లేని రైస్ మిల్లులకు బియ్యాన్ని కేటాయిస్తున్నారని , నిబంధనలను పాటిస్తున్న మిల్లులకు బియ్యం కేటాయించకుండా వివక్ష చూపుయున్నారని అన్నారు. లంచాలు ఇచ్చిన వారికే బియ్యం ఇస్తున్నాడని ఆరోపించారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాధ్ పై గతంలో జిల్లా కలెక్టర్ , విజిలెన్స్ డిజి , సివిల్ సప్లయ్ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయనపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని , అధికారి అవినీతికి సహకరిస్తున్న వీరిపై కూడా చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు తెలిపారు. కొంత మంది అధికారుల చర్యల కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని , ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని రాచాల కోరారు.

## నానాక్ రాం గూడ లో గంజాయి డాన్ నీతుబాయి ఇంట్లో సోదాలు

**బషీర్ బాగ్ వెలుతురు 2 డిసెంబర్ :**



నానక్రాం గూడలో గంజాయి డాన్ నీతుబాయి ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ బీ టీమ్ లీడర్ ప్రదీప్రావు , సీఐ బిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో 786 గ్రాముల గంజాయి, 110 బీరు, బ్రిజర్, ఒక బ్కెక్, గంజాయి అమ్మకాలు జరుపగా వచ్చిన రూ. 60,890 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గొవింద్, దుర్గేష్, నీతుబాయి కుమారుడు దుర్గ ప్రసాద్లను అరెస్టు చేశారు. ఒరిస్సా నుంచి గంజాయిని తీసుక వచ్చి అమ్మకాలు జరుపుతున్నారని విచారణ నిందితులు వెల్లడిరచారని టీమ్ లీడర్ ప్రదీప్రావు తెలిపారు.నిందితులను, గంజాయి, మద్యాన్ని, నగదును షేర్లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

## జాగృతి 'జనం బాట' పోస్టర్ ఆవిష్కరణ డిసెంబర్ 4 నుంచి మేడ్చల్ జిల్లాలో పర్యటన

**కాప్రా, డిసెంబర్ 02 వెలుతురు :**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన 'జాగృతి జనం బాట' కార్యక్రమం డిసెంబర్ 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పర్యటించనుంది. ఈ పర్యటనకు సంబంధించిన పోస్టర్ను జాగృతి నాయకులు కాప్రాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దూగుంట్ల నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కవిత ప్రారంభించిన ఈ జనం బాట కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈ నాలుగు రోజుల పాటు సాగే జనం బాట పర్యటన వివరాలను ఆయన వెల్లడించారు డిసెంబర్ 4 ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో, డిసెంబర్ 5 కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో, డిసెంబర్ 6 కంటోన్మెంట్, కూకట్పల్లి నియోజకవర్గాల్లో, డిసెంబర్ 7 మేడ్చల్ నియోజకవర్గంలో పర్యటన సాగనుంది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామిడి వెంకట్ రెడ్డి,



రాష్ట్ర యువజన అధ్యక్షులు గోగికర్ నవీన్ కుమార్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్ఛార్జి గోపు సదానందం, మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్ఛార్జి ప్రశాంత్ చారి, మేడ్చల్ యూత్ అధ్యక్షులు కల్వకుంట్ల కోటేశ్వర్ రావు, రాష్ట్ర కార్యదర్శి భవాని వేముల, కొప్పుల అర్జున్, గరిక విజయ్, రమ్య, సాయి రాజ్, మొయినుద్దీన్, సాయి రాజేష్, సిద్ధార్థ్, సదాశివ, ప్రదీప్ గౌడ్, ఖాజా, ఆసిఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ డివిజన్ లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథన్

- ఆదర్శ బస్తీకి వచ్చి కాలనీ సమస్యలు అడిగి తెలుసుకున్న కమిషనర్
- డివిజన్ లోని సమస్య లను పరిష్కరించాలని కమిషనర్ వివరించిన చెప్పిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
హిమాయత్ నగర్ డివిజన్లో హైడ్రా కమిషనర్ రంగనాథన్ ఆదర్శ బస్తీకి వచ్చి వీధి నెంబర్ 14 నందు గల అపార్ట్మెంట్ వాసులు కొంత కాలంగా వారి బోర్ పంపుల్లోకి మురుగునీరు రావడం వలన చాలా ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేయడం వలన వచ్చి వాటర్ వర్క్స్ అధికారులు మున్సిపల్ అధికారులు అందరికీ కలిసి వచ్చి స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ని అడిగి సమస్య పరిష్కారానికి తమ హైడ్రా తరుపున చేయవలసిన ఏమైనా చర్యలు ఉన్నా తాము తీసుకుంటామని బస్తీ వాసులు మరియు అపార్ట్మెంట్ వాసులు అందరూ కలిసి సమస్యను పరిష్కరించుకోవాలి తెలియజేశారు అలాగే స్థానిక బస్తీలో అంతటా కూడా రిటర్నింగ్ వాళ్ళు నిర్మాణం జరిగిందని ఒక 35 మీటర్ల వరకు రిటర్నింగ్ వారి నిర్మాణం ఆగిపోయిందని అక్కడ నాలా వెడల్పు చాలా ఎక్కువగానే ఉంది కాబట్టి దానిని పరిశీలించి అక్కడ ఉన్న సమస్యను పరిష్కరించాల్సిందిగా రంగనాథన్ దృష్టికి తీసుకువెళ్లగా వారి అధికారులను యోగ నారాయణ ని ఏరియల్ సర్వే నిర్వహించి అధికారులకు తగిన నిర్ణయం తీసుకోవాల్సిందిగా తెలియజేశారు స్థానికంగా ఉన్న బస్తీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్స్ జి రామన్ గౌడ్, జక్యాస్ ఇన్, స్థానికులు చందు, నందు, అజర్, అఖిల్ హైమద్, సర్ఫరాజ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవికి పితృవియోగం



**బషీర్ బాగ్ వెలుతురు 2 డిసెంబర్ :**
తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి తండ్రి ఎచౌబాసింగ్ (85) ఈరోజు మణిపూర్ లోని ఇంపాల్ లో తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా, ఎల్. బి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది వారి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు.

## కోహెడ జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహణ



**తుర్కయంజాల్ వెలుతురు డిసెంబర్2:**
తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ జిల్లా పరిషత్ పాఠశాలలో శ్రీమతి తిరుపతి బాయ్ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎం విజయ కుమార్ మరియు బన్సీలాల్ గార్ల సహకారంతో విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ విధులు మరియు బాధ్య తలు తెలిపేలా నిజమైన ఎన్నికలు ఎలా ఉంటాయో చక్కగా అవగాహన కలిగించారు ఇందులో సర్పంచ్ గా పోటీ చేసిన విద్యార్థి డీ కార్తీక్ గెలుపు పొందారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీమతి ఉమామహేశ్వరి లక్ష్మణ్ గోపాల్ రెడ్డి శ్రీమతి రాధా మాధవి జగదీశ్వరచారి కొండయ్య అమర్ సింగ్ ఆర్ డి చంద్రమోహన్ గణేష్ జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్,రికార్డు అసిస్టెంట్ యాదయ్య మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి

- కీలు బొమ్మల్లా రామచందర్ రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్ 2 వెలుతురు:**
హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి నడుస్తోందని, తెలంగాణ రాజకీయాల్లో త్వరలో సంచలనం జరగబోతుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు చేతిలోకి తెలంగాణ బీజేపీ రిమోట్ కంట్రోల్ వెళ్లిపోయిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు చేతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలు బొమ్మల్లా మారిపోయారని అన్నారు. ఇక నుంచి హరీష్ కార్యక్రమాలను కేటీఆర్ కంటే ఎక్కువగా ప్రచారం వచ్చే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం



ప్రణాళిక చేస్తోందని చెందారు. తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు కీలక నేతలు.. హరీష్ రావు, ఈటల రాజేందర్ వ్యూహంలో ఇప్పుడు బీజేపీ చిక్కిందని అన్నారు. ప్రస్తుతం సామ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచింది. మరోసారి హరీష్ రావు బీజేపీ తీర్థం పుచ్చుకుంటారనే వార్తలకు ఆద్యం పోసినట్టయింది. హరీష్ రావు బీజేపీలో చేరుతారంటూ వస్తున్న వార్తలు కొత్తేమి కాదు. గతంలో కూడా హరీష్ గులాబీ గూటి నుంచి ఎగిరిపోయి కాషాయ జెండా కప్పుకుంటున్నారని అనేక వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై హరీష్ రావు పలుమార్లు స్పందించారు. ఆ వార్తలను ఖండించారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయబడ్డ ఎమ్మెల్సీ కవిత హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్, కేటీఆర్ లకు కవిత సూచనలు చేశారు. కాగా కవిత కూడా హరీష్ రావు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారని పరోక్షంగా హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరి త్వరలో తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిమాణాలు జరుగుతాయని సామ రామ్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ నిజమవుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# పవన్ కళ్యాణ్ నరదిష్టి వ్యాఖ్యలు దుర్మార్గం

- పదిరోజులైనా మన మంత్రులకు సోయిలేదు
- మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 'నర దిష్టి' వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రతిపక్ష నేతలతో పాటు కాంగ్రెస్ మంత్రులు మూకుమ్మడిగా దాడికి దిగారు. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై పది రోజుల తర్వాత స్పందించిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరని విమర్శించారు. కొందరు వాటర్‌లో నీళ్లు కలుపుకుని స్పృహ కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. మరికొందరు కమిషన్లు పంచుకునే పనిలో బిజీగా ఉన్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై పది రోజులకు స్పందించడం హాస్యాస్పదమని జగదీశ్ రెడ్డి అన్నారు. ఒక ప్రాంతం, ఒక మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. ఉద్యమ సమయంలో



తామెప్పుడూ ప్రాంతాలను దూషించలేదని తెలిపారు. అన్నదమ్ములుగా విడిపోయి వేర్వేరుగా కలిసి బతుకుదామని కేసీఆర్ ఆనాడే చెప్పారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ నీడలో హైదరాబాద్‌లో ప్రశాంతంగా ఉన్నామని ఏపీ ప్రజలే చెప్పారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటే మంచిదని హితవుపలికారు. పవన్ కళ్యాణ్ సినిమాలను ఆపుతామని ఇక్కడి మంత్రి కామెడీగా మాట్లాడుతున్నారని కోమటిరెడ్డిని ఉద్దేశించి జగదీశ్ రెడ్డి విమర్శించారు. వాస్తవానికి అభిమానం వేరు.. రాజకీయం వేరు అని చెప్పారు. తమ అభిమాన హీరోగా ఎవరి సినిమాలనైనా ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. పది రోజుల తర్వాత కాంగ్రెస్ మంత్రులు స్పందించిన తీరు ఇద్దరిలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్లుందని విమర్శించారు. కండ్ల ముందు కృష్ణా నీళ్లు తీసుకెళ్తుంటే అప్పుడూ అలసత్వమే అని మండిపడ్డారు. నీళ్లు, కమిషన్లపై పెట్టిన దృష్టి అభివృద్ధిపై పెడితే మంచిదని సూచించారు. తాజాగా బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కూడా పవన్ కళ్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడుతూ.. పవన్ రాజకీయ ప్రయాణాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒంటరిగా గెలవలేని వ్యక్తి పవన్ కళ్యాణ్. సొంతగా ఎన్నికల్లో గెలవలేక, కమ్మ, కాపు సామాజిక వర్గాలను ఏకం చేసి సినిమాలో లాగా సమయానికి చంద్రబాబు వచ్చి కాపాడితే గెలిచి ఉప ముఖ్యమంత్రి అయ్యావు. అసలు తెలంగాణ మీద నీకెందుకు అంత ఏడుపు? తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నావా? అంటూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలను అవమానించేలా పవన్ వ్యాఖ్యలు ఉన్నాయని, వాటిని బీఆర్ఎస్ పార్టీ ఖండిస్తుందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ వివాదంపై పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## మున్సిపాలిటీల విలీనం ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**
జీహెచ్ఎంసీ విస్తరణకు కీలకమైన 'మున్సిపాలిటీల విలీన ఆర్డినెన్స్'పై గవర్నర్ ఆమోదం తెలిపారు. ఫైల్ ప్రభుత్వానికి చేరడంతో, తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే గెజిట్ విడుదల చేయనుంది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించే తీర్మానం చేసింది. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాకు ఆనుకొని ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట ఉన్న 27 పురపాలక సంస్థలను జీహెచ్ఎంసీ పరిధిలో చేర్చేందుకు ఆమోదం తెలిపింది. ఈ విలీనానికి అనుగుణంగా జీహెచ్ఎంసీ చట్టం, తెలంగాణ మున్సిపాలిటీల చట్టాలలో సవరణలు చేయాలని కూడా నిర్ణయించింది.

## టిడిపి పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా మీర్జా ఫజల్ బేగ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 02:**
పట్టణ కేంద్రం సర్పంచ్ అభ్యర్థిగా టిడిపి పార్టీకి చెందిన మీర్జా ఫజల్ బేగ్ మంగళవారం నామినేషన్ వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో సర్పంచ్ గా గెలిచి అన్ని రంగాలలో వెనుకబడినటువంటి పట్టణ కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహా, అధికార ప్రతినిధి బత్తుల సత్యం, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట కార్యదర్శి నకిరేకంటి గణేష్, డి. రాములు, ఆకవరపు సాయి, ఎండి అంజర్, సోహెల్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకి ఉచిత సేవలందిస్తున్న అగ్రీ క్లినిక్

**- లీగల్ సెల్ సభ్యులు కానుగంటి శ్రీశైలం**



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 02:**
మండల కేంద్రంలోని రైతు వేదిక నందు లీగల్ సర్వీసెస్ అధ్వర్యంలో ఆగ్రీ క్లినిక్ (వ్యవసాయ న్యాయ సహాయ సలహా కేంద్రం) రైతులకి ఉచిత సేవలందిస్తుందన్నారు. ఈ క్లినిక్ నందు లీగల్ సర్వీసెస్ నుండి కానుగంటి శ్రీశైలం హాజరై మాట్లాడుతూ ఇక్కడ రైతులకి కావలసిన భూ చట్టాలు, వయో వృద్ధులు సంక్షేమం, వ్యవసాయ అనుబంధ న్యాయ సలహాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఏదైనా సమస్యలు ఉన్న ప్రతి మంగళవారం,శుక్రవారాలలో ఇక్కడ క్లినిక్ నందు అందుబాటులో ఉండనున్నట్లు, రైతు హాజరవడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు.

## రామన్నపేట బీఎస్పీ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నకిరేకంటి నరేష్ నామినేషన్.



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 02:**
మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బీఎస్పీ మండల అధ్యక్షులు నకిరేకంటి నరేష్ మంగళవారం రామన్నపేటలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడినుండి ర్యాలీగా నామినేషన్ కేంద్రం వరకు బిఎస్పి పార్టీ నియోజకవర్గ జిల్లా అధ్యక్షులు తో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చినంటి ఆయుధం ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని. నామినేషన్ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు గూని రాజు, పావురాల నరసింహ యాదవ్, గ్యార మారయ్య, నోముల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొంతమంది సర్పంచ్ అభ్యర్థులు సెటిల్మెంట్ల కోసం నామినేషన్లు..?

**మునుగోడు డిసెంబర్ 02 వెలుతురు:**
సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మునుగోడు మండలం లో కొందరు ప్రజా సేవ చేద్దామని నామినేషన్లు వేస్తుంటే మరికొందరేమో ఇదే అదునుగా దందా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు కావాలని నామినేషన్లు వేసి, ప్రధాన పోటీదారులతో మాట్లాడుకుంటున్నారు. కొంత డబ్బు తీసుకుని విత్ డ్రా చేసుకుని, సెటిల్మెంట్లు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన ఎన్నికలను సైతం చివరకు దందా చేశారని పలువురు నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు.



నల్గొండ డీసీసీ ప్రెసిడెంట్‌గా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్న పున్న కైలాష్ నేత
**నల్లగొండ జిల్లా వెలుతురు డిసెంబర్ 02:**

# దివిస్ ఆధ్వర్యంలో ఆరోగ్య, కంటి వైద్య శిబిరాలు











**రామన్నపేట వెలుతురు డిసెంబర్ 02:**
దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో రామన్నపేట మండలం వెల్లంకి లోని జెడ్పి ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఉచిత వైద్య కంటి పరీక్ష శిబిరాలను మంగళవారం నిర్వహించారు. 350 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులతో పాటు అవసరమైన ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా దివీస్ లేబరేటరీస్ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి సామాజిక కార్పొరేట్ బాధ్యత నిధులతో విద్యార్థులకు నోట్ బుక్స్ బ్యాగులు, సైన్స్ లాబరేటరీ పరికరాలు, నీటి శుద్ధి యంత్రాలు అందజేశామని, వారి ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి లు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్నందుకు దివిస్ కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యాధికారులు డాక్టర్ జయంత్, డాక్టర్ శివ, దివిస్ ప్రతినిధులు సాయి కృష్ణ, వెంకటేష్, ఉపాధ్యాయులు పారిజాత, నర్మద, జ్యోతి, స్వప్న, హేమలత, శైలజ, శ్రీనివాస్ రెడ్డి, శీనా రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పిట్లం అభివృద్ధే నా లక్ష్యం - నవాబ్ సుదర్శన్ గౌడ్

**- పిట్లం సర్పంచ్ అభ్యర్థి నవాబ్ సుదర్శన్ గౌడ్ నామినేషన్ దాఖలు**







**జుక్కల్ వెలుతురు డిసెంబర్ 02:**
జుక్కల్ నియోజకవర్గం పిట్లం గ్రామ సర్పంచ్ స్వతంత్ర్య అభ్యర్థిగా నవాబ్ సుదర్శన్ గౌడ్ తన నామినేషన్ ను దాఖలు చేశారు. ఈ మేరకు తన నివాసం నుండి అనుచరులతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక నిధులు తెచ్చి పిట్లం అభివృద్ధికి దోహదపడతానని ఆయన హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో తన సోదరుడు మహిపాల్ గౌడ్ పిట్లం ఎంపీపీగా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధికి చేపట్టిన పనులను గుర్తు చేశారు. పిట్లం గ్రామంలో నిరుద్యోగ ఆడపడుచులకు కుట్టు మిషన్లతో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్, ఇంట్లో ఎవరైనా చనిపోతే తక్షణ ఆర్థిక సాయం, నిరుపేద ఆడపడుచులకు పెళ్లి కానుక, స్కూలు పిల్లలకు నోటు పుస్తకాలు, నిరుద్యోగులకు ఉచిత స్టడీ మెటీరియల్ మరియు ఆన్లైన్ కోచింగ్, పరీక్షల సమయంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తాని సుదర్శన్ గౌడ్ హామీ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామస్తుల క్షేమం కోసం అన్ని ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటు, గ్రామ పంచాయతీ స్థలాల యందు ఆహ్లాదకర పార్కుల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**- డిసెంబర్ 4న ఆదిలాబాద్ లో పర్యటించనున్న సీఎం రేవంత్ రెడ్డి**
**- ఆదిలాబాద్ మున్సిపాలిటీ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం**



**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి డిసెంబర్ 4 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పట్టణానికి వస్తున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి ఇవాళ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులతో కలిసి ఇందిరా ప్రియదర్శిని స్టేడియాన్ని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేయనున్న పనులు, బహిరంగ స్థలం, హెలిపాడ్, పార్కింగ్, ప్రజలకు కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి పట్టణాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. అదే విధంగా తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ ను హైదరాబాద్ లో నిర్వహించబోతున్నామని, ఈ సమ్మిట్ లో వ్యవసాయం, పరిశ్రమలు, మహిళల సాధికారిత, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, ఇలా అనేక అంశాలపై చర్చలు జరిపి, ఒక రూట్ మ్యాప్ ను సిద్ధం చేస్తామని చెప్పారు. ప్రతిపక్షాలనే లేకుండా చేస్తామని చూసిన బీఆర్ఎస్ నాయకులకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ప్రజా ప్రభుత్వ పాలనకు రెఫరెండం అని ఆ పార్టీ నాయకులు చెప్పారు.. ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించారు అంటే.. ఈ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనదానికి నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా, అసత్య ప్రచారాలు చేసినా..ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే మున్సిపాలిటీ, ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతారని స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు.

## సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజకీయ ప్రతీకార చర్య

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై కొత్త ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడాన్ని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. రాజకీయ ప్రతీకార చర్యగా దీన్ని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తపరచడం నేరం కాదు. ప్రజల కోసం, దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్న నాయకులపై ఇలా కేసులు నమోదు చేయడం అంగీకారయోగ్యం కాదు అన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడానికి చేసిన రాజకీయ ప్రయత్నం. కాంగ్రెస్ పార్టీ, నాయకుల పట్ల ప్రజల్లో ఉన్న అపారమైన విశ్వాసాన్ని దెబ్బతీయాలని చేసే నిష్ఫల ప్రయత్నమిది. న్యాయం తప్పకుండా గెలుస్తుంది," అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అన్యాయ చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

## తెలంగాణ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల భావంతో ఉండే రాష్ట్రాలు.. తెలంగాణ తుఫాన్ లో మునుగుతుంటే మేము ప్రకృతి అనుకున్నాం తప్ప ఆంధ్రప్రదేశ్ ను తప్పుపట్టడం లేదు.. ఎక్కడో కోనసీమ లో కొబ్బరి చెట్లు ఎండిపోతే ఆంధ్రప్రదేశ్ కి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలింది అంటే ఆయన వివేకవంతుడ.. లేక అవివేకవంతుడా.. మిత్రపక్షంకు బాధ్యత వహిస్తున్న తెలంగాణ బీజేపీ నాయకత్వం ఆయన వ్యాఖ్యలపై స్పందించాలని కోరుతున్న.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు స్పందించాలి స్వయంగా బీజేపీ పొత్తు ఉంది కాబట్టి రెండు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు కలిగేలా మాటలు మాట్లాడడం దురదృష్టకరం.. ఆంధ్రప్రదేశ్ లో తుఫాను వస్తె మా హుస్నాబాద్ మునిగింది.. మేము ఆంధ్రప్రజలను తప్పు పట్టడం లేదు.. ఆది ప్రకృతి వైపరీత్యం కింద భావిస్తున్నాం అక్కడెక్కడో చెట్లు ఎండిపోతే మా దిష్టి తగిలిందని నిందిస్తే ఇది తెలంగాణ ప్రజలకు అవమానకరం.. వెంటనే పవన్ కళ్యాణ్ తన మాటలు ఉప సంహరించుకోవాలి..క్షమాపణలు కోరాలి.. భవిష్యత్తులో ఇలాంటి వివక్షపూరిత మాటలు మాట్లాడవద్దు.. విజ్ఞతగా వ్యవహరించాలి.. ఉప ముఖ్యమంత్రి బాధ్యతగా మాట్లాడాలి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కలిసి దేశంలో ఉన్నతంగా ఎదగాలి.. ఇలాంటి వ్యాఖ్యలు మాకు రావు.. మీరు మాట్లాడకూడదు.

## దుబ్బ రూప కుటుంబానికి అండగా ఉంటాం..

**- ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్..**



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు హామీ ఇచ్చారు. మంగళవారం రోజున గాంధీ భవన్ లో మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావ్ ఆధ్వర్యంలో దుబ్బ రూప కూతురు సాత్విక కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెతో మాట్లాడి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

## సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

**- హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలంటూ పూల సంతోష్ డిమాండ్..**



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షులు పూల సంతోష్, సీఎం రేవంత్ రెడ్డి హిందూ భావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సమాజాన్ని అవమానించేలా మాట్లాడటం రాజకీయ బాధ్యతారాహిత్యానికి ఉదాహరణ అని ఆయన విమర్శించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసినందుకు సీఎం రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలని పూల సంతోష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముక్కోటి దేవతలపై వ్యాఖ్యలు చేయడం అవివేకానికి నిదర్శనం. సనాతన ధర్మంపై శతాబ్దాలుగా ఎన్నో దాడులు జరిగినా, అది ఎప్పుడూ నిలబడింది. మొఘలులు, బ్రిటిష్ పాలకులు ధర్మాన్ని అంతరించలేకపోయారు. కాంగ్రెస్ పాలనా కాలంలో కూడా ఎన్నో అవరోధాలు వచ్చినా సనాతన ధర్మం శాశ్వతంగా కొనసాగుతోందని చెప్పారు. అంతేకాక, జవహర్‌లాల్ నెహ్రూ నుండి రాజీవ్ గాంధీ వరకు ధర్మాన్ని దెబ్బతీసే విధానాలు నడిచాయని, నేడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల మార్గదర్శకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే దారిలో నడుస్తున్నారని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని కించపరిచే వారు చరిత్రలో నిలబడరు. కానీ ధర్మం మాత్రం ఎప్పటికీ నిలుస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలను అద్దంలా చూపిస్తూ, మైనార్టీల మద్దతు కోసం ముఖ్యమంత్రి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని పూల సంతోష్ విమర్శించారు. హిందూ సమాజం ఇవన్నీ చూస్తోంది. సరైన సమయంలో సీఎం రేవంత్‌కు ప్రజాస్వామ్య సమాధానం చెబుతుందని హెచ్చరించారు.

## అయ్యా నా భార్యను గెలపించండి

**- ఓ వ్యక్తి కన్నీటితో భార్య కోసం ప్రచారం**

**సిద్దిపేట,డిసెంబర్ 2( వెలుతురు):**
ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో ఎలాగైనా తన భార్యను సర్పంచ్‌గా గెలిపించాలని ఓ వ్యక్తి ఇల్లిల్లు తిరుగతూ ప్రచారం చేపట్టాడు. ఎలాగైనా గెలిపిస్తే గ్రామానికి సేవ చేస్తానంటూ ఆ వ్యక్తి కంటతడి పెట్టుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో జరిగింది. నాగుల ప్రశాంత్ అనే వ్యక్తి గత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. రెండో విడత నామినేషన్లకు మంగళవారం చివరి రోజు కావడంతో భార్యతో నామినేషన్ వేయించాడు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయాయని.. ఈసారి తన భార్య నాగుల స్రవంతిని గెలిపించాలని వేడుకుంటూ కంటతడి పెట్టుకున్నారు. ఈసారి తనను సర్పంచ్‌గా గెలిపించాలని స్రవంతి ఓటర్లను కోరారు. మహిళకు రిజర్వ్ కావడంతో అతను తన భర్యను బరిలోకి దింపాడు. గతంలోనే తాను ఉన్నదంతా ఖర్చు పెట్టానని అన్నాడు. అందువల్ల ఈసారి గెలిపించాలని వేడుకున్నాడు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీ రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- **మున్సిపాలిటీ లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, కమ్యూనిటీ హాల్ లు, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి**
- **పనులు ప్రారంభించుకొని నెలలు గడుస్తున్న పూర్తి కాకపోవడం పై అసంతృప్తి..**
- **పెండింగ్ పనులు, పూర్తయిన పనులు, ప్రతిపాదనలు చేసే పనులపై అధ్యాయానికి త్రిసభ్య కమిటీ**
- **మున్సిపాలిటీ అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**




**హుస్నాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**




హుస్నాబాద్ రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీ గా నిలపడానికి అందరూ కష్టపడి పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలో పెండింగ్ పనులు, పూర్తయిన పనులు ఇతర అంశాలపై హుస్నాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్లు , డ్రైనేజీ నిర్మాణాలు,కమ్యూనిటీ హాల్ లు , ఎల్లమ్మ చెరువు సుందరీకరణ , డివైడర్ ల మధ్య సెంట్రల్ లైటింగ్ ,మొక్కల పెంపకం ,జంక్షన్ ల సుందరీకరణ పనుల పురోగతి పై ఆరా తీశారు. పెండింగ్ పనుల ఆలస్యం పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ రోడ్ల పెండింగ్ పనులు డిసెంబర్ 31 లో పూర్తి చేయాలని గడువు విధించారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు మార్చ్ 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సిద్దేశ్వర ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులకు టెక్నికల్ ఇష్యూ లేకుండా సమస్య పరిష్కారం చేయాలన్నారు. పద్మశాలి , గౌడ , బంజారా , మైనార్టీ , వైశ్య, విశ్వ బ్రాహ్మణ, రెడ్డి , మున్నూరు కాపు ,రజక, యాదవ కమ్యూనిటీ హాల్ లో పెండింగ్ లో ఉన్నాయని ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం కావాల్సి ఉందని వాటి పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలో పూర్తయిన పనులు,ఇంకా పెండింగ్ లో ఉన్న పనులు,ప్రతిపాదనలు చేయాల్సిన వాటిపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు.ఇందులో మున్సిపల్ అధికారితో పాటు ,రెవెన్యూ శాఖ నుండి ఒకరు ,ఆర్ అండ్ బి నుండి ఒకరు ఉంటారు. ఈ కమిటీ డిసెంబర్ 15 లోపు ఇచ్చే నివేదిక ద్వారా భవిష్యత్ లో చేయాల్సిన పనులు ఇంకా పెండింగ్ పనులు వేగవంతం చేయవచ్చని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. మల్లె చెట్టు నుండి ఎల్లమ్మ చెరువు రోడ్డు పనులు ప్రారంభం కావాల్సి ఉందని తెలిపారు. హైవే మీద డివైడర్ల మీద సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. డివైడర్ల పై చెట్లు,జంక్షన్ ల వద్ద విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెహ్రూ విగ్రహం వద్ద ఎత్తు పెంచి ఎత్తైన కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసి సుందరీకరణ చేయాలని ఆదేశించారు. చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేసి అందులో ఇన్నోవేటివ్ గేమ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్ లో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్న పూల మొక్కలు నాటాలని సూచించారు. గతంలో భారీ వర్షాలు టౌన్ ముంపుకు గురయ్యేదని ఈసారి అంత భారీ వర్షం కురిసిన పట్టణంలో వచ్చిన నీరు వచ్చినట్టు వెళ్లేలా తీసుకున్న చర్యల ద్వారా ముంపుకు గురికాలేదని సిబ్బందిని అభినందించారు. స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సూచించారు .పల్లె చెరువు బ్యూటిఫికేషన్ పూర్తి చేసి వాకింగ్ ట్రాక్ ,అలంకరణ మొక్కలు నాటాలని తెలిపారు. త్వరలోనే హుస్నాబాద్ మున్సిపాల్టీ కి రింగ్ రోడ్డు మంజూరు అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి , మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన కీలక నాయకులు

**- గులాబీ కండువాలతో స్వాగతం పలికిన ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్...**



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరసంఘం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. టి. సంగమేశ్



మారత్తమ్మ, రౌఫ్ లతో పాటు మరో 20 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికారికంగా పార్టీని వీడి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీఆర్‌ఎస్ గౌరవ శాసనసభ్యులు కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కొత్తగా చేరిన నాయకులకు గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, “మోసపూరిత హామీలతో గద్దెను ఎక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేస్తోంది. అభివృద్ధి పేరుతో ఇచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది” అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల వరకూ తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులను కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసం నింపాయని, పార్టీ బలపడటానికి మరింత శ్రమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొగ్గుల సంగమేశ్వర్, మాజీ సర్పంచులు జగదీశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏజెస్ బాబా, మాజీ ఉప సర్పంచులు బషీర్, హమీద్, బాల్ రాజ్, అతీక్, విలాస్, సామెల్, అజర్, సద్దాం తదితరులు పాల్గొన్నారు. కొత్తగా చేరిన నాయకుల నిర్ణయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్గోయ్‌లో నామినేషన్ దాఖలు చేసిన డా. నర్సింలుకు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం ఎల్గోయ్ గ్రామంలో బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ నర్సింలు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన్ని అభినందించేందుకు జహీరాబాద్ బీజేపీ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి, గొల్ల భాస్కర్, రమేష్ రెడ్డి బసంతపూర్, శ్రీనివాస్ గుప్తా తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షుడు విశ్వనాథ్ బంటు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ నర్సింలు అభ్యర్థిత్వం గ్రామానికి మంచి అవకాశం అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పట్ల ఆయనకున్న దృఢ సంకల్పం, సామాజిక సేవ పట్ల చూపుతున్న అంకితభావం ప్రజలకు ప్రయోజనకరమవుతుందని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందించే నాయకత్వం డాక్టర్



నర్సింలుదేనని, ఆయన విజయం ఎల్గోయ్ గ్రామానికి కొత్త అభివృద్ధి దిశగా దారితీస్తుందని నాయకులు నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ నర్సింలు మాట్లాడుతూ గ్రామ అభివృద్దే తన ప్రధాన సంకల్పమని చెప్పారు. పాథ్‌లైటింగ్, శుద్ధి నీటి సరఫరా, అంతర్గత రహదారుల విస్తరణ, గ్రామ శానిటేషన్, వ్యవసాయ సదుపాయాల మెరుగుదల, మహిళల సాధికారత వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యువత గ్రామ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజల నమ్మకానికి తగిన సేవలు అందించడం తన ధ్యేయమని, ఎల్గోయ్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 7న మెదక్‌లో సిఐటియు రాష్ట్ర మహాసభల బహిరంగ సభ

**- కార్మిక హక్కుల రక్షణకు పెద్ద ఎత్తున హాజరవ్వాలంటూ పిలుపు...**

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించేందుకు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రామిక భవన్‌లో జరిగిన పారిశ్రామిక క్లస్టర్ కమిటీ సమావేశంలో మహాసభల బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ, ఈ నెల 7 నుంచి 9 వరకు మెదక్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలు కార్మిక వర్గ చరిత్రలో కీలకమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాలు, పోరాటాలు, క్రమశిక్షణను సమీక్షించడంతోపాటు భవిష్యత్తు ఉద్యమ మార్గసూచీని సిద్ధం చేసేందుకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పూర్తిగా బానిసలుగా మార్చే దిశగా లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం తీవ్రంగా ఖండించారు. కార్మికులకు రక్షణ కలిగించే




చట్టాలను రద్దు చేసి, పరిశ్రమల యజమానులకు అనుకూలంగా లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమని మహిపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెదక్‌లో జరగనున్న మహాసభల బహిరంగ సభను జయప్రదం చేసేందుకు జహీరాబాద్ సహా మొత్తం పారిశ్రామిక ప్రాంతాల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల సిఐటియు నాయకులు రాజిరెడ్డి, నరేష్, మహేశ్వర్, గణేష్, నారాయణ, సందీప్ రెడ్డి, కిరణ్, పాషా, శివరామరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ యూనివర్సిటీకి రూ.7.92 కోట్లు విడుదల




**అమరావతి, డిసెంబర్ 2( వెలుతురు):**
కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో అభివృద్ధి పనులకు ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7.92 కోట్ల అదనపు నిధులు విడుదలకు ప్రభుత్వం పరిపాలనా పరమైన ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ యూనివర్సిటీలో భవన నిర్మాణాల చెల్లింపులకు నిధులు వెచ్చించాలని సూచించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉన్నత విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించింది.

## పరిశ్రమల రాకతో ఉద్యోగాలకు భరోసా

**అమరావతి, డిసెంబర్ 2( వెలుతురు):**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పరిశ్రమల రాకతో రాష్ట్ర ముఖచిత్రం మారనుందన్నారు. అమరావతితో రాజధాని సమస్యతో పాటు, నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కియా లాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వైకాపా హయాంలో అభివృద్ధి పూర్తిగా దెబ్బతిందని అన్నారు.

## బంగారం ధరలకు రెక్కలు



**ముంబై, డిసెంబర్ 2( వెలుతురు):**
బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ధరలకు ఎక్కడా బ్రేక్ అనేది పడటం లేదు. రోజూ ఎంతకొంత పెరుగుతూనే సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలతో రేట్లు పెరుగుతూ గోల్డ్ ప్రియులను షాక్‌కు గురి చేస్తున్నాయి. బంగారంతో పాటు వెండి ధరలు కూడా అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దాదాపు తులం బంగారం లక్షన్నరకు చేరుకోగా.. సామాన్య, మధ్యతరగతి జనం షాపుల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో పెళ్లిళ్ల సీజన్ల సమయంలో కూడా బంగారం షాపులు వెలవెలపోయి దర్శనమిస్తున్నాయి. కస్టమర్లు రాకపోవడంతో బంగారం షాపులకు కూడా డిమాండ్ ఉండటం లేదనే చెప్పుకోవాలి.ఈ క్రమంలో బంగారం ధరలపై మరో షాకింగ్ న్యూస్ వచ్చింది. మరికొన్ని వారాల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరు నుంచి ఏడు వారాల తర్వాత బంగారం ధరలు మరింత చేయనున్నాయని బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత వారం బంగారం ధరలు 3 శాతం పెరిగాయి. ఈ వారం సరికొత్త రికార్డును సృష్టించే అవకాశముందని చెబుతున్నారు. పది గ్రాములకు రూ.5 వేల వరకు పెరగొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇండియాలో పెళ్లిళ్ల సీజన్‌తో పాటు US సెంట్రల్ బ్యాంక్ త్వరలో వడ్డీ రేటును తగ్గించే అవకాశముంది. ఇక రష్యా, నాటో, ఉక్రెయిన్ మధ్య వివాదం ముదురుతోంది. ఈ కారణాలు బంగారం ధరల పెరుగుదలకు దారితీయవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.ఈ సంవత్సరంలో బంగారం ధరలు 60 శాతం పెరిగాయి. అక్టోబర్ 17న దేశ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది.ఈ వారంలో మరింత గరిష్ట స్థాయికి చేరుకునే ఛాన్స్ ఉందని బిజినెస్ వర్గాలు అంచనా కడుతున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే బంగారం ప్రియులకు షాక్‌గా చెప్పుకోవచ్చు.

## ప్రతీఒక్కరి ఫోన్లలో సంచార్ సాథీ యాప్

**ముంబై, డిసెంబర్ 2( వెలుతురు):**




భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా.. కేంద్రం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇవి తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా రోజూ వందలమంది సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి మోసపోతున్నారు. లక్షల రూపాయల డబ్బులను పోగొట్టుకుంటున్నారు. రోజుకో కొత్త రూపంలో ప్రజలను బుట్టలో వేసుకుని చాలా స్మార్ట్‌గా మోసానికి పాల్పడుతున్నారు సైబల్ క్రిమినల్స్. మెట్రో సిటీలలో ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సైబర్ క్రైమ్ పోలీసులు నేరగాళ్లను పట్టుకుని కొంతమందికి డబ్బులు తిరిగివచ్చేలా చేస్తుండగా..నిందితులను గుర్తించలేక మరికొంతమందికి తిరిగి రావడం లేదు. దేశంలో ఇలాంటి పరిస్థితులే నెలకొనగా.. దీనికి చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త ఆలోచన కనిపెట్టింది.ఇకపై కొత్త మొబైల్ ఫోన్లలో డిఫార్ట్‌గా కేంద్ర ప్రభుత్వ 'సంచార్ సాథీ' యాప్ తప్పనిసరిగా ఉండేలా చేయాలని స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలతో పాటు టెలికాం కంపెనీలకు టెలికాం మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే తయారై మార్కెట్లోకి లాంచ్ కానున్న ఫోన్లలో కూడా డీఫాల్ట్‌గా యాప్ రావాలని, అది డిలీట్ చేయడానికి వీలుకాకుండా ఉండాలని సూచించింది. ఈ మేరకు యాప్ ఇన్‌స్టలేషన్ కోసం టెలికాం, మొబైల్ తయారీ కంపెనీలకు 90 రోజుల గడువు ఇచ్చింది. అయితే థర్డ్ పార్టీ యాప్‌లను ముందుగా ఇన్‌స్టాల్ చేయడానికి ఎప్పటినుంచో యాపిల్ వ్యతిరేకత చూపిస్తోంది. దీంతో కేంద్ర కొత్త నిర్ణయాన్ని యాపిల్ వ్యతిరేకించే అవకాశముందని తెలుస్తోంది. యాపిల్ ఒప్పుకోకపోతే కేంద్రం ఎలా స్పందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.సైబర్ నేరాలు, ఫోన్ల చోరీకి అడ్డుకట్ట వేసేందుకు ఈ ఏడాది జనవరిలో కేంద్రం సంచార్ సాథీ యాప్‌ను ప్రవేశపెట్టింది. మొబైల్ చోరీకి గురైతే ఇందులోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా పోగొట్టుకున్న పనిచేయకుండా బ్లాక్ చేయడం, ఐఎంఈఐని వెరిఫై చేసుకోవడం, ఫోన్ పోతే ఫిర్యాదు చేయడం. మీ పేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయే తెలుసుకోవడం వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చోరీకి గురైన 7 లక్షల మంది ఫోన్లను కేంద్రం గుర్తించింది. ఇక ఐఎంఈఐ నెంబర్ల ట్యాపరింగ్‌కు పాల్పడుతున్న ఘటనలు కూడా ఎక్కువైపోయాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రతీ ఫోన్‌లో సంచార్ సాథీ యాప్ ఉండాలని కేంద్రం భావిస్తోంది.

# కల్తీనెయ్యి... పరకామణి.. నెక్ట్స్ ఎవరంటూ తీవ్ర చర్చ

**తిరుమల, డిసెంబర్ 2( వెలుతురు):**
అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కథ తెల్చే పనికి వేళయింది. కల్తీ నెయ్యి కేసు నిజాలు తేల్చే పనిలో ఉన్న సిట్ ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయబోతోంది. ఇప్పటికే 29 మంది నిందితులను కేసులో చేర్చి పలువురిని విచారించిన సిట్ 9 మందిని అరెస్టు చేసింది. మరికొద్ది మందిని నిందితులుగా చేర్చేందుకు మెమోలు దాఖలు చేసింది. అంతేకాకుండా.. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్ గా, ఈఓలుగా పనిచేసిన వారిని విచారించింది. డెయిరీ యాజమాన్యాలను, నిందితులను జైలుకు పంపింది. ఇప్పుడు టిటిడి అధికారుల అరెస్టులకు సిద్ధం కావడం.. ఇన్వెస్టిగేషన్ స్పీడ్ అవ్వడంతో.. ఉద్యోగుల్లో భయాందోళనలకు కారణం అయ్యింది. నెక్ట్స్ ఎవరంటూ తీవ్ర చర్చ జరుగుతోంది.దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ తుది దశకు చేరుకుంది. NDDB కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీని గుర్తించిన టిటిడి శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చే పనిలో ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. సీబీఐ నేతృత్వంలోని 5 మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం డిసెంబర్ 15 లోపు ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయాలని నిర్ణయించింది. సిట్‌లో సీబీఐ తరపున మురళి రాంబా కీలకంగా వ్యవహరిస్తుండగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ పని పూర్తి చేస్తోంది. క్షేత్రస్థాయిలో దర్యాప్తు పూర్తి చేసిన సిట్ అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ కేంద్రంగా ఏడాదిగా విచారణ చేస్తోంది.ఇందులో భాగంగానే కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే టీటీడీ ఉద్యోగుల్లో కల్తీ నెయ్యి కేసు భయం నెలకొంది. కేసులో A29 గా టీటీడీ ప్రొక్యూర్మెంట్ జీఎం గా పనిచేసిన సుబ్రహ్మణ్యం అరెస్ట్ కావడంతో ఫియర్ పిక్స్ కు చేరుకుంది. ఇప్పటికే నిందితులుగా ఉన్న ఉద్యోగులను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని బావిస్తున్న పరిస్థితి వెంటాడుతోంది. అంతేకాకుండా.. పలువురిని విచారించే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం..సుబ్రహ్మణ్యం రిమాండ్ రిపోర్టులో కల్తీ నెయ్యి సరఫరాపై సంచలన విషయాలు బయటపడ్డాయి. కల్తీ నెయ్యిని స్వచ్ఛమైన ఆవు నెయ్యిగా టీటీడీకి సరఫరా జరిగేలా సహకరించింది సుబ్రహ్మణ్యమే నని సిట్ రిమాండ్ రిపోర్టులో





పేర్కొంది. బోలే బాబా డయిరీ నుంచి రూ. లక్షల్లో లంచం, విలువైన కానుకలు సుబ్రహ్మణ్యం అందుకున్నట్లు సిట్ నిర్ధారణకొచ్చింది.బోలే బాబా, వైష్ణవి డయిరీలను తనిఖీ చేయడానికి వెళ్లిన అధికారులు విలువైన వస్తువులు, నగదు పొందినట్లు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది. కేసులో A24 గా ఉన్న చిన్నఅప్పన్న కు సహకరించి నెయ్యి సప్లై చేసిన కంపెనీలతో సుబ్రహ్మణ్యంతో పాటు మరికొందరు లాలూచీ పడినట్లు సిట్ గుర్తించింది. మైసూర్ ల్యాబ్ రిపోర్టును దాచి బోలే బాబా డయిరీ కి రెండు దఫాల్లో దాదాపు 1.20 లక్షల కిలోల దాకా నెయ్యి సరఫరాకు ఆర్డర్ల ను ఇవ్వడంలో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర పోషించినట్లు సిట్ తెలిపింది. నెయ్యి సరఫరాకు సాంకేతికంగా అర్హత పొందిన సంస్థలకు లబ్ధి చేకూర్చేలా టెండర్ల ప్రక్రియను నిర్వహించేలా అప్పటి టిటిడి ప్రొక్యూర్మెంట్ జిఎం సుబ్రహ్మణ్యం ప్రయత్నించినట్లు సిట్ పేర్కొంది.మరోవైపు కల్తీ నెయ్యి కేసు దర్యాప్తును ముగించే దశలో ఉన్న సిట్ టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాదులో, టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డిని తిరుపతిలో రెండు రోజులు పాటు విచారించింది. ఇలా కల్తీ నెయ్యి సరఫరా కేసులో అప్పటి పాలకమండలిని, అధికారులను, నెయ్యి సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులను, సహకరించిన వారిని విచారించింది. అయితే టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమని సిట్ విచారణలో తేరడంతో ఇప్పుడు కొందరు ఉద్యోగుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే A24 నుంచి A36 వరకు మరో 12 మంది నిందితులను కేసులో చేర్చేందుకు సిట్ సిద్ధమైంది. ఈ మేరకు నెల్లూరు కోర్టులో మెమో దాఖలు చేసింది.నిందితుల్లో 7 మంది టిటిడి ఉద్యోగులు తోపాటు 5మంది డయిరీ లకు చెందిన వారుగా పేర్కొన్న సిట్ అధికారులు.. 2019 నుంచి టిటిడి ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్ లుగా, వేర్ హౌసింగ్, గోశాల డయిరీ ఉద్యోగులు గా పనిచేసిన వారిని నిందితులుగా తేల్చింది. డెయిరీ శాంపిల్స్ సేకరించి నిపుణుల నివేదిక ఇవ్వాలని 2022 మే నెలలో అప్పటి టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశించగా ఇదే అదునుగా అక్రమాలు జరిగినట్లు సిట్ భావిస్తోంది.. 2018 నుంచి 2024 వరకు నెయ్యి సరఫరా చేసిన డయిరీ ప్లాంట్ సందర్శించిన నిపుణులు కమిటీ నివేదికను, ల్యాబ్ రిపోర్టులను పక్కన పెట్టి ఇదే అవకాశంగా చేసుకుని కొందరు డయిరీ యాజమాన్యాల నుంచి ముడుపులు, కానుకలను పొందినట్లు సిట్ తేల్చింది. ఇలా కక్కుర్తి పడ్డ వారిలో నిపుణులు, టిటిడి ప్రొక్యూర్మెంట్ జీఏంలు, కొందరు ఉద్యోగులు ఉన్నట్లు సిట్ ఛార్జ్ షీట్ కూడా వేయబోతుండటం సంచలనంగా మారింది.

# హైదరాబాద్ సిటీపై కోకాపేట ఎఫెక్ట్.. సొంత ఇంటి కలగా మారుతున్న వేళ..

**హైదరాబాద్, డిసెంబర్ 2( వెలుతురు):**
హైదరాబాద్‌లో ఇప్పుడు ఔటర్ రింగ్ రోడ్ సమీపానికి వెళ్లి ఓ 1000 ఎస్ఎఫ్టీ అపార్టుమెంట్ కొనుక్కోవాలంటే కనీసం కోటి రూపాయలు అవుతోంది. ఇక స్కై స్క్రాపర్లలో అయితే కనీసం రెండు కోట్లు అవుతోంది. ఓ మధ్యతరగతి జీవి .. కోటి పెట్టి ఇల్లు కొనగలరా?. రూ. 50 లక్షలు అయితేనే జీవితాంతం ఈఎంఐ కట్టుకుంటూ ఓ ఇల్లు కొనగలరు?. అలాంటి పరిస్థితుల్లో భూముల రేట్లను వేలం పెట్టి మరీ రికార్డుల మీద రికార్డులు సృష్టించే దిశగా అమ్ముతూంటే.. ఇక మధ్యతరగతికి అందుబాటులో ఇళ్లు ఉంటాయా?ప్రభుత్వం కోకాపేట్‌లో భూములు వేలం వేస్తోంది. ఒక్క ఎకరానికి 150 కోట్లు దాటిపోతోంది. ఈ ధరలు చూస్తుంటే సామాన్యులకు ఇల్లు కొనడం కలలా మారిపోయింది. ఈ వేలాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బాగా లాభం చేస్తున్నాయి. బడా రియల్ ఎస్టేట్ సంస్థలు భూములు కొని లగ్జరీ ఫ్లాట్లు కడుతున్నాయి. కోకాపేటలో ఒక్కో ఫ్లాట్ 4 నుంచి 10 కోట్ల వరకు ఉంటుంది. ఈ ఫ్లాట్లు కొనేవాళ్లు కేవలం బాగా సంపాదించే వాళ్లే. కోకాపేట్ ధరలు పెరిగితే దాని పక్కనే ఉన్న మణికొండ, నర్సింగి, గచ్చిబౌలి ధరలు కూడా పెరుగుతాయి. ఆ తెల్లాపూర్, ఆ తర్వాత కొల్లూరు వరకూ ఇప్పుడు మధ్యతరగతి వాళ్లు హైదరాబాద్‌లో ఇల్లు కొనాలంటే కనీసం 1.5 నుంచి 2 కోట్లు కావాలి. ప్రభుత్వానికి వేలం ద్వారా వేల కోట్లు వస్తున్నాయి. ఆ డబ్బుతో రోడ్లు, మెట్రో విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు చేస్తామని అంటోంది. కానీ పథకాల అమలు కోసమే అని




అందరికీ తెలుసు. ఇప్పుడు హైదరాబాద్‌లో రెండే రకాల ఇళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి – చాలా ఖరీదైన లగ్జరీ ఫ్లాట్లు, లేదా నగరం బయట చాలా దూరంలో ఉండే చిన్న ఫ్లాట్లు. మధ్యలో మధ్యతరగతి వాళ్లకు తగిన ఇళ్లు దాదాపు లేవు. గతంలో బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్ మాత్రమే ఖరీదుగా ఉండేవి. ఇప్పుడు కోకాపేట్, గచ్చిబౌలి కూడా అలాంటి స్థాయికి వచ్చేశాయి. ఇక హైదరాబాద్ నగరం మొత్తం మధ్యతరగతి వారికి ఇల్లు లేదు అన్నట్టు మారిపోతోంది. ప్రభుత్వం ఇలాగే వేలాలు పెడుతూ పోతే రేపు మధ్యతరగతి వాళ్లు నగరం బయటకు వెళ్లిపోవాల్సి వస్తుంది. లేదా ఇల్లు కొనే కలనే వదులుకోవాల్సి వస్తుంది. డబ్బు ఉన్నవాళ్లకు హైదరాబాద్ స్వర్గం అయిపోతోంది. డబ్బు లేని వాళ్లకు ఇక్కడ స్థలం లేకుండా పోతోంది.ప్రభుత్వం ఆదాయం మాత్రమే చూసుకుంటోంది. వేలం వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పును ఊహించడం లేదు. కొంత మంది బిల్డర్లు భారీగాఖర్చు పెట్టి భూములు కొనుగోలు చేయడం వల్ల ఆ ప్రభావం హైదరాబాద్ మొత్తం పడుతుంది. రియల్ ఎస్టేట్ భూమ్ ఉందని చెప్పి అన్ని చోట్లా ధరలు పెంచుతారు. గత కొంత కాలంగా ఇదే జరుగుతోంది. చిన్న బిల్డర్లు.. ఏ సౌకర్యాలు లేని అపార్టుమెంట్లలోనే ఇప్పుడు డబుల్ బెడ్ రూం 70 లక్షలకు అమ్ముతున్నారంటే.. ఇక సామాన్యుడు ఎలా సొంత ఇంటి కలను నిజం చేసుకోగలడు. హైదరాబాద్‌లో ఒక్క ఐటీ వర్గం... అది కూడా ఉన్న వైట్ కాలర్ జాబ్స్ చేసే వారికి మాత్రమే ప్రస్తుతం ఇళ్ల కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. వారి డిమాండ్ పరిమితం. త్వరలో ఈ బూమ్ బద్దలయ్యే అవకాశం ఉంది. మరో వైపు మధ్యతరగతికి అందుబాటు ధరల ఇళ్లను నిర్మించడానికి సిద్ధమే కానీ.. భూమి తక్కువ ధరకు ప్రభుత్వం ఇస్తే చాలని అంటున్నారు. వందల కోట్లు పెట్టి భూమి కొని.. తక్కువ ధరలకు ఎలా అమ్ముతామని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వం ఆదాయం కోసమే వేలం వెర్రిగా భూములను వేలం వేస్తే.. ఆ ప్రభావం మధ్యతరగతిపై ఎక్కువగా పడుతోంది. దీనికి పరిష్కారాన్ని ప్రభుత్వం కూడా ఆలోచించాల్సిందే.

# కన్నీళ్లు తెప్పిస్తున్న రైతు ఆత్మహత్య

**ఖమ్మం, డిసెంబర్ 2( వెలుతురు):**
వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎన్నో నష్టాలు వస్తున్నాయని, అతికష్టమ్మీద పంట పండిస్తే దానికి మద్దతు ధర రాదని ఆవేదన వ్యక్తం చేస్తూ కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని, ఎక్కువ మద్దతు ధర ఇవ్వాలని, సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని.. తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బానోతు వీరన్న సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుల మందు తాగిన తరువాత తమ బాధను చెప్పుకుంటూ తీసిన సెల్ఫీ వీడియో వైరల్ అవుతోంది. రైతు ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నానని.. మద్దతు ధర కల్పించాలని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలకు నిదర్శనం అని విమర్శించారు.కౌలు రైతు వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్య. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా ఆర్థిక తోడ్పాటు లేక, అప్పులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, ఓట్లు వేశాక రైతులను మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో రైతు వీరన్న చెప్పిన మాటలకైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం వస్తుందా?. ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు. ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు?' అని హరీష్ రావు ప్రశ్నించారు.

సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కలిసి పోరాటం చేద్దాం. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని' హరీష్ రావు అన్నదాతలకు సూచించారు.

## కేబినెట్ ప్రక్షాళన.. శ్రీధర్ బాబుకు కీలక బాధ్యతలు..

**హైదరాబాద్, డిసెంబర్ 2( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో త్వరలో పునర్వ్యవస్థీకరణ జరగబోతోంది. మరో వారం, పదిరోజుల్లో ఈ మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో సుమారు నలుగురు లేదా ఐదుగురు మంత్రులను తప్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పునర్వ్యవస్థీకరణలో ముఖ్యంగా కొత్త వారికి చోటు కల్పించడంతో పాటు, పార్టీ విధేయత, సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయికాంగ్రెస్ పార్టీకి ఇటీవలే తిరిగి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాలపై ఇది ప్రభావం చూపనుంది.ప్రస్తుత మంత్రుల్లో ఒకరైన జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుండి తప్పించే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.కొండా సురేఖ స్థానంలో ఉత్తమ్ పద్మావతికి అవకాశంమంత్రి కొండా సురేఖను తప్పించి, ఆమె స్థానంలో మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి మంత్రి పదవి దక్కవచ్చని తెలుస్తోంది.ప్రస్తుతం మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కేంద్ర రాజకీయాలకు పంపి, ఏఐసీసీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.మంత్రి పొన్నం ప్రభాకర్ను తప్పించి, ఆయన స్థానంలో ఎమ్మెల్సీ మహేశ్



కుమార్ గౌడ్కు మంత్రివర్గంలో చోటు కల్పించే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. పొన్నం ప్రభాకర్‌ను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశం ఉంది.ప్రస్తుత మంత్రి శ్రీధర్ బాబును కీలకమైన హోంమంత్రిత్వ శాఖకు మార్చడంతో పాటు, రాష్ట్ర పీసీసీ చీఫ్ బాధ్యతలను కూడా అప్పగించే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు సమాచారం.ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన టీమ్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని, వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, ప్రాంతీయ సమతుల్యతను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పులపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

వెలుతురు

cinema

## రష్మిక థామ మూవీ ఓటిటి కి వచ్చేసింది......

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 2 :** బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందాన పాత్రలో నటించిన హర్రర్ థ్రిల్లర్ " థామ" హర్రర్ కామెడీ యూనివర్సల్ లో భాగంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఇప్పుడు ఏ ప్రకటన లేకుండా సైలెంట్ గా ఓటీటిలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. హిందీ తోపాటు తెలుగులోనూ అందుబాటులో ఉంది అయితే ప్రస్తుతానికి రేంటెడ్ విధానంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఉచితంగా స్ట్రీమింగ్ ఎప్పటినుంచి అనేది తెలియాల్సి ఉంది. ఆదిత్య దర్శకత్వం వహించగా దినేష్ విజన్ నిర్మించారు. నవాజుద్దీన్ సిద్ధికి , పరేష్ రావల్, వరుణ్ ధావన్, ఆసిఫ్ ఖాన్, సత్య రాజ్ కీలక పాత్రల్లో మెప్పించారు.




## హిందీలో అడుగు పెట్టాలంటే ఆర్భాటం తప్పనిసరి

### మళయాల నటుడు దుల్కర్ సల్మాన్

హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ..ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.



## బంధం ఉన్నంత వరకే కొనసాగుతుంది

### రాజ్‌నిడుమోరు మాజీ భార్య శ్యామాలి

తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంపై రాజ్ మాజీ భార్య శ్యామాలి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వస్తోన్న రూమర్స్‌కు చెక్ పెడుతూ దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటకు నెటిజన్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలుపుతోన్న వేళ.. రాజ్ మాజీ భార్య శ్యామాలి పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఎప్పుడూ తన ఆలోచనలను సోషల్ మీడియా వేదికగా పంచుకునే ఆమె తాజాగా ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. 'ఈ అనంత విశ్వంలో మనం ఒక మూల ఉన్నాం' అని అర్థం వచ్చేలా ఒక ఇమేజ్ షేర్ చేశారు. రాజ్ – సమంతల వివాహం జరిగిన రోజు సోమవారం కూడా శ్యామాలి పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని ఆమె రాసుకొచ్చారు. అలాగే, మనతో రుణం ఉన్నంత వరకే బంధాలు అన్నీ ఉంటాయి. రుణం తీరిన తర్వాత బంధం శాశ్వతంగా దూరమవుతుందని శ్యామాలి ఐదు రోజుల క్రితం తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు.





## సెలబ్రిటీలు మరణిస్తే ఇంత దిగజారుడా

### ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ

సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టా÷–గ్గ÷ట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదని జాన్వీ అన్నారు.




## సమంత దంపతులు అమెరికాలో సెటిల్ అవుతారా?

రాజ్, సమంతల వివాహంపై గతంలో జ్యోతిష్యుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.2023 జూన్ 27న ఆయన చేసిన ట్వీట్‌లో .. సమంత 2024లో ప్రేమలో పడుతుంది, 2025లో రెండో పెళ్లి చేసుకుంటుంది, 2026లో భర్తతో కలిసి అమెరికాలో సెటిల్ అవుతుందని పేర్కొన్నారు. ఈ జోష్యంలో ముందటి రెండు విషయాలు నిజమవడంతో, ఇప్పుడు మూడో అంశం సమంత 2026లో అమెరికాకు వెళ్లి సెటిల్ అవుతుందా? అని నెటిజన్స్ ముచ్చటించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ కినీ కూడా తాజాగా స్పందిస్తూ, సమంత విషయంలో నేను చెప్పిన జ్యోతిష్యం నిజమైంది అని మరోసారి పోస్ట్ చేశారు. అయితే సమంత 2026లో అమెరికాలో సెటిల్ అయితే?ఆమె సినిమాలకు గుడ్‌బై చెబుతుందా? ఇకపై టాలీవుడ్ ప్రాజెక్టుల్లో కనిపించదా? అంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## అడల్ట్ కామెడీతో సైక్ సిద్ధార్థ

టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్దార్థ'. మీలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది. ఎక్కువగా బూతులతోనే ట్రైలర్‌ను నింపేశారు.

## రామ్ గోపాల్ వర్మ కస్టడీలో రావు రమేష్ - మనోజ్ బాజ్ పాయ్....

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 2 :** ఒకప్పుడు హారర్ చిత్రాలకు రాంగోపాల్ వర్మ కేరాఫ్ అడ్రస్ గా నీలిచాడు. అయితే చాలాకాలం తర్వాత మరోసారి వర్మ అదే జోనర్ లో మూవీ చేస్తున్నాడు. 'పోలీస్ స్టేషన్ మే బూత్'. ఈ సినిమా షూటింగ్ హైదరాబాదులో షరా వేగంగా సాగుతోంది జెనీలియా, రమ్యకృష్ణ ,మనోజ్ బాజ్ పాయ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ మధ్యకాలంలో మనోజ్ బాజ్ పాయ్ ప్రధాన పాత్ర పోషించిన ఫ్యామిలీ మెన్ వెబ్ సిరీస్ తోను దేశవ్యాప్తంగా అందరినీ అభిమానాన్ని మరోసారి చురుకున్నాడు. ఇది లా ఉంటే ' పోలీస్ స్టేషన్ మే బూత్' మూవీలో రావు రమేష్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు .




ఈ మూవీకి సంబంధించిన ఓ వర్కింగ్ స్టిల్ ను వర్మ ఎప్పటిలాగా సరదాగా తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రావు రమేష్ గతంలో హిందీ సినిమాలు చేసిన దాఖలు లేవు. అతనికి ఇదే తొలి సినిమా కావచ్చు. వర్మ కెరియర్ లోనే బెస్ట్ అనిపించుకున్న శివ , రంగీలా సినిమాలు గత నెలలో ఇటు తెలుగులోనూ అటు హిందీలోనూ రీ రిలీజ్ అయ్యాయి.

## యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని: రసిక దుగల్

బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# పార్లమెంట్‌లో సంచార్ సాథీపై రగడ

**- ప్రజల ప్రైవసీని దెబ్బతీసేదిని మండిపడ్డ విపక్షం**

**- దీనిని వెంటనే తొలగించాలని డిమాండ్**

**- అసవరం లేకుంటే తొలగించవచ్చన్న సింధియా**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 2( వెలుతురు):**




పార్లమెంట్‌లో సంచార్ సాథీపై అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ప్రధానంగా కాంగ్రెస్, శివసేన, తదితర పార్టీలు దీనిని తీవ్రంగా విమర్శిస్తూ ఇది.. ప్రజల ప్రైవసీ ఉల్లంఘనే అంటూ సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. విపక్ష కాంగ్రెస్ దీని మీద వాయిదా తీర్మానం దాఖలు చేసి సంచార్ సాథీపై విస్తృత చర్చ కావాలని డిమాండ్ చేసింది. సంచార్ సాథీ యాప్.. ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ దీనిని ఇదొక డిస్టోపియన్ టూల్ అని.. ఇది ప్రతి భారతీయుడిని మానిటర్ చేయడమే కాకుండా.. వారి ఆర్థిక హక్కులపై దాడిగా అభివర్ణించారు. దీని అమలు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపి రేణుక చౌదరి దీనిపై వాయిదా తీర్మానం దాఖలు చేశారు. మరో ఎంపిప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ ఇది ఒక దారుణమైన పరిణామమని.. ఇది భవిష్యత్‌లో నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. ప్రజల గోప్యతను హరిస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ కూడా దీనిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు. విపక్షాల ఆందోళన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. సంచార్ సాథీ యాప్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సంచార్ సాథీ మీద చర్చకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, కానీ ఎజెండా ప్రకారం సెషన్‌లో 14 బిల్లులపై ఫోకస్ పెడదామని సూచించారు. అటు, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికామ్ కూడా దీనిపై స్పందించింది. సంచార్ సాథీ కేవలం ప్రజల సైబర్ సెక్యూరిటీ కోసం ఉద్దేశించింది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదంది. ఈ యాప్ యూజర్ డేటా రక్షిస్తుందని తెలియజేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా కీలక ప్రకటన చేశారు. స్మార్ట్‌ఫోన్ యూజర్లు తమ మొబైల్ నుంచి సంచార్ సాథీ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పారు. ఆ యాప్ తప్పనిసరి కాదని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇండియాలో స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే కంపెనీలకు ఇటీవల కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ కీలక ఆదేశాలు ఇచ్చింది. కచ్చితంగా స్మార్ట్‌ఫోన్లలో ప్రభుత్వ సంబంధిత సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేసి ఉంచాలని పేర్కొన్నది. ఆ ఆదేశాలను విపక్షాలు తప్పుపడుతున్నాయి. సంచార్ సాథీ యాప్ వల్ల గోపత్యకు భంగం కలిగే అవకాశాలు ఉన్నట్లు విమర్శలు చెబుతున్నారు. భారత్‌లో విక్రయించే అన్ని మొబైళ్లలో ప్రభుత్వం రూపొందించిన సైబర్ సెక్యూరిటీ యాప్ సంచార్ సాథీని డిఫాల్ట్‌గా అందించాలని కేంద్రం మొబైల్ తయారీ సంస్థలను ఆదేశించింది. దీనిపై సోమవారం రాత్రి పీఐబీ ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ఈ ఆదేశాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన కేంద్రం.. దానికి సంబంధించి 120 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేసింది. దీనిపై విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్రం వెనక్కి తగ్గింది. ఇది తప్పనిసరి కాదని వెల్లడించింది. ఆ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పింది. అయితే దేశాన్ని నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ దుయ్యబట్టారు. ఫోన్లపై నిఘానో, సంచార్ సాథీ యాప్ విషయమో కాదు.. అన్ని అంశాల్లో వారి వైఖరి అలాగే ఉందని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇది పెగాసస్ ప్లస్‌ప్లస్. బిగ్ బ్రదర్ మన ఫోన్‌ను, మొత్తం మన ప్రైవేటు జీవితాన్ని స్వాధీనం చేసుకుంటాడని కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే విపక్షాలు పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం సృష్టించొద్దని, అన్ని అంశాలపైనా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆ విమర్శలను తోసిపుచ్చారు. కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందించారు. ఆ యాప్‌ను వాడాలనుకోకపోతే.. మొబైల్ ఫోన్ వినియోగదారులు దానిని తొలగించే ఆప్షన్ ఉందని వెల్లడించారు. మీరు దానిని కొనసాగించాలని అనుకుంటే.. మీ ఫోన్‌లో ఉంచుకోవచ్చు. డిలీట్ చేయాలనుకుంటే చేసేయొచ్చు. మీరు ఫోన్ కొనుగోలు చేసినప్పుడు ఎన్నో యాప్‌లు ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. అవి వద్దనుకుంటే తొలగించుకుంటాం కదా. ఇది యూజర్ల రక్షణకు సంబంధించిన అంశం. ఇందులో తప్పనిసరి ఏమీ లేదు. మీరు రిజిస్టర్ కాకపోతే.. అది అచేతనంగా ఉండిపోతుంది. డిలీట్ కూడా చేసుకోవచ్చు. అయితే మోసం నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒక యాప్ ఉందని ప్రతిఒక్కరికీ తెలియదు. కాబట్టి ఆ సమాచారాన్ని వెల్లడి చేయడం ప్రభుత్వ బాధ్యత' అని మంత్రి వెల్లడించారు. ఫోన్ తయారీదారులకు ఆదేశాలు జారీ చేయడం వెనకగల కారణం ఇదేనన్న ఉద్దేశంలో సమాధానం ఇచ్చారు.

# మూగ బాలుడిపై వీధికుక్కల దాడి

**- తీవ్ర గాయాలతో నీలోఫర్‌కు తరలింపు**




**హైదరాబాద్,డిసెంబర్ 2( వెలుతురు):**

హైదరాబాద్‌లోని హయత్‌నగర్ శివగంగ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. సుమారు 10 నుంచి 20 కుక్కలు ఎగబడటంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శునకాల దాడిలో అతని చెవి ఊడిపోవడంతోపాటు తల, నడుము, వీపు భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు గత మూడేండ్లుగా శివగంగ కాలనీలో కిరాయికి ఉంటున్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ పుట్టుకతో మూగవాడు. మంగళవారం ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో నీళ్లు పడుతున్నది. ఈ క్రమంలో ఇంటి బయట ఆడుకుంటున్న ప్రేమ్‌చంద్‌పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమేసి బాలుడిని రక్షించారు. అనంతరం అతడిని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి నిలోఫర్‌కు పంపడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నారు. కాగా, నగరంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని, జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పార్లమెంటులో సర్ ఆందోళనలు

**- ఉభయసభల్లో చర్చకు పట్టు**

**- గందరగోళం మధ్య లోక్‌సభ నేటికి వాయిదా**



**న్యూఢిల్లీ,డిసెంబర్ 2( వెలుతురు):**

ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళనకు దిగడంతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ఓట్ చోరీ, గద్దీ చోరీ అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. ఫలితంగా ఉభయసభల్లో గందరగోళం నెలకొన్నది. లోక్‌సభ ను కంట్రోల్ పెట్టేందుకు స్పీకర్ ఓంబిర్లా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో స్పీకర్ ముందుగా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనా సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ పునఃప్రారంభ మైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గందరగోళం కొనసాగింది. దాంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి ఓట్లు దోచిపెట్టే పని చేస్తున్నదని విమర్శించారు.

# 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం

**- కాశీ కుర్రాడు వేదమూర్తికి మోడీ ప్రశంసలు**



**న్యూఢిల్లీ,డిసెంబర్ 2( వెలుతురు):**

19 ఏళ్ల పండితుడు వేదమూర్తి దేవావ్రత్ మహేశ్ రేఖీపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దండక్రామ పారాయాణాన్ని పూర్తి చేసిన క్రమంలో ఆ కుర్రాడిని ప్రధాని మెచ్చుకున్నారు. శుక్ల యజుర్వేదంలోని మధ్యాంధినిలో ఉన్న సుమారు 2000 మంత్రాలను ఆ యువకుడు పారాయణం చేశారు. వరుసగా 50 రోజుల్లో ఆ మంత్రాలను అతను వల్లించాడు. ఇదో గొప్ప ఘనత అని ప్రధాని మోదీ తన ప్రశంసలో పేర్కొన్నారు. రాబోయే తరాలు ఈ అద్భుత ఘనతను గుర్తుంచుకుంటాయని అన్నారు. భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఆ కుర్రాడు సాధించిన ఘనతను గర్విస్తారన్నారు. ఎటువంటి అవరోధాలు లేకుండా శుక్ల యుజుర్వేదంలోని 2 వేల మంత్రాలను ఆ యువకుడు పఠించినట్లు చెప్పారు. కాశీ నియోజకవర్గానికి చెందిన ఆ కుర్రాడు ఆ పవిత్ర పట్టణంలో అసాధారణ ఫీట్‌ను సాధించడం పట్ల సంతోషంగా ఉందని ప్రధాని అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో మోదీ మెసేజ్ చేశారు. ఆ కుర్రాడికి సపోర్టు ఇచ్చిన కుటుంబసభ్యులకు, పండితులుకు, సంస్థలకు ప్రధాని థ్యాంక్స్ తెలిపారు. మరో వైపు హర్యానాలోని జాజర్‌లో ఉన్న సిద్ధ బాబా పాల్‌నాథ్ ఆశ్రమాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ప్రాణ ప్రతిష్ఠ, ఆత్మ భండార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సనాతన సంస్కృతి, మానవ పరిణామ క్రమంలో దాని ప్రభావాన్ని ఆయన తన ప్రసంగంలో తెలిపారు.

# గద్వాల ఎస్సీ హాస్టల్‌లో దారుణం

**- కలుషితాహారం తిని విద్యార్థులకు అస్వస్థత**

**జోగులాంబ గద్వాల,డిసెంబర్ 2( వెలుతురు):**

గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. మంగళవారం ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం విద్యార్థులకు వాంతులు కావడంతో.. వారిని ఆస్పత్రికి తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని, ఆ విషయాన్ని వార్డెన్‌కు చెప్పడంతో పారవేశారని విద్యార్థులు తెలిపారు. ఆ తర్వాత అరటిపళ్లు, బిస్కెట్లు తిని స్కూల్‌కి వెళ్లారు. కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులైనట్లు విద్యార్థులు చెబుతున్నారు.

# అమరావతికి రెండో విడత భూ సమీకరణ

**- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**అమరావతి,డిసెంబర్ 2( వెలుతురు):**




ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలి కేబినేట్‌లో ఈభూముల సేకరణకు ఆమోదించారు. ఏడు గ్రామాల్లో 16,666.57 ఎకరాల పట్టా, ఎసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురంలో 1,965 ఎకరాలు, పెద్దమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాల పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమి.. కర్లపూడి లేమ్మలెలో 2,603 ఎకరాల పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురంలో 1,448.09 ఎకరాల పట్టా, 2.29 ఎకరాల అసైన్డ్, పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా మరో గ్రామం కలిపి మొత్తం 7 గ్రామాల్లో 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్‌భూముల్ని సమీకరించాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూసమీకరణలో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com